


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | సోమవారం | 31-08-2026 | సంపుటి: 3 | సంచిక: 208 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 31-08-2026 | VOLUME : 3 | ISSUE : 208 | PAGES: 8 | COST: 2/- |

**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

## రియల్‌ఎస్టేట్ సంస్థగా
# కాంగ్రెస్ ప్రభుత్వం

- రూ.500 కోట్ల విలువైన భూమిని రూ.87 కోట్లకే ప్రైవేటు వ్యక్తికి అప్పగించే యత్నం
- ఆయిల్‌ఫెడ్‌కు భూమి దక్కకుండా చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపణ
- 1987 సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శ
- ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత సర్కారుపై ఉందని వ్యాఖ్య
- నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే న్యాయ, ప్రజా పోరాటం



**హైదరాబాద్, ఆగస్టు 30:** నగరం నడిబొడ్డున ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రియల్‌ఎస్టేట్ సంస్థగా మారిపోయిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ సమాజ సంక్షేమాన్ని పక్కనబెట్టి కమీషన్ల కోసం వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను కారుచౌకగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. అజామాబాద్ భూముల కేటాయింపులో అవకతవకలు జరుగుతున్నాయని పేర్కొంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సుదీర్ఘ బహిరంగ లేఖ రాశారు.

మిగతా 2వ పేజీలో..

## వెయ్యి రోజుల్లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ

- కుటుంబ పాలనకు ముగింపు..
- ప్రజలకు చేరువైన పాలన ప్రజావాణి, గ్రామసభలతో ప్రజల ముంగిటకు ప్రభుత్వం 3.42 కోట్ల మందికి ఉచిత సన్నబియ్యం పంపిణీ
- కులగణన, ఎస్సీ వర్గీకరణలో ముందడుగు అప్పుల భారంలోనూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

2






# ఆన్‌లైన్‌లో బీఆర్ఎస్.. ఆన్‌గ్రౌండ్‌లో రేవంత్

- డిజిటల్ ప్రచారంలో దూసుకెళ్తున్న ప్రతిపక్షం
- ప్రజల్లోకి వెళ్లడానికే సీఎం ప్రాధాన్యం
- మాస్ డైలాగ్స్‌తో రాజకీయ వేడి
- గ్రామీణ ఓటర్లపై ప్రత్యక్ష ప్రభావం
- డిజిటల్ బలహీనతను పర్యటనలతో భర్తీ చేసే యత్నం

**హైదరాబాద్, ఆగస్టు 30:** తెలంగాణ రాజకీయాల్లో ప్రచార పోరు కొత్త రూపు సంతరించుకుంటోంది. బీఆర్ఎస్ డిజిటల్ మీడియా, సామాజిక మాధ్యమాలను ప్రధాన అస్త్రాలుగా చేసుకుని ప్రభుత్వంపై విమర్శలను విస్తృతంగా ప్రచారం చేస్తుండగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం క్షేత్రస్థాయి రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కంటే ప్రజలను నేరుగా కలవడం, బహిరంగ సభలు, జిల్లాల పర్యటనల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను వివరించడంపైనే దృష్టి సారిస్తున్నారు.

**డిజిటల్‌లో కాంగ్రెస్ వెనుకంజ**

తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఉన్నంత బలమైన సామాజిక మాధ్యమ వ్యవస్థ కాంగ్రెస్‌కు లేకపోవడం రాజకీయంగా ప్రతికూలంగా మారుతోంది. గత పదేళ్లలో బీఆర్ఎస్ నిర్మించుకున్న డిజిటల్ నెట్‌వర్క్ ద్వారా ప్రభుత్వంపై విమర్శలను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం కొనసాగుతోంది. దీనికి సమర్థంగా దీటైన ప్రచార వ్యవస్థను కాంగ్రెస్ ఇంకా నిర్మించుకోవాల్సి ఉంది. ఈ లోటును రేవంత్ రెడ్డి తన పర్యటనలు, బహిరంగ సభలతో భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నారు. తరచూ జిల్లాల్లో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలవడం ద్వారా ప్రభుత్వానికి క్షేత్రస్థాయిలో మద్దతు పెంచుకోవాలని భావిస్తున్నారు.

**మాస్ ప్రసంగాలతో రాజకీయ వేడి**

రేవంత్ రెడ్డి ప్రసంగాలు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కావడం లేదు. ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు, ఘాటు వ్యాఖ్యలతో రాజకీయ

మిగతా 2వ పేజీలో..

# మూసారాంబాగ్ బ్రిడ్జి పూర్తి

- రూ.52 కోట్లతో 400 మీటర్ల పొడవున వంతెన నిర్మాణం
- 14.5 మీటర్ల వెడల్పుతో వంతెన.. 3.5 మీటర్ల ఫుట్‌పాత్
- అంబర్‌పేట్–మూసారాంబాగ్ మధ్య ఏడాది పొడవునా రాకపోకలు
- వర్షాకాలంలో ముంపు, రాకపోకల అంతరాయాలకు శాశ్వత పరిష్కారం
- ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని కమిషనర్ కర్ణన్ ఆదేశం

2




## తెలంగాణలో గోదావరి పుష్కరాల
# నిర్వహణకు సన్నాహాలు

- గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ గుర్తొచ్చేలా ఏర్పాట్లు
- జూన్ 26 నుంచి జులై 7 వరకు పుష్కరాలు
- ఏర్పాట్లకు రూ.1,000 కోట్లు మంజూరు
- భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు తెలంగాణ ఆతిథ్యం
- శాఖల మధ్య సమన్వయానికి ప్రత్యేక అధికారి కార్యాలయం

3





## వన మహోత్సవం.. ప్రజా ఉద్యమంగా మారాలి

- మొక్కలు నాటడంతో బాధ్యత తీరదు.. సంరక్షణే కీలకం
- 6.18 కోట్ల మొక్కల నాటడమే లక్ష్యం
- ఇప్పటికే 5.61 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు వెల్లడి
- గుంతల తవ్వకంలో 92 శాతం.. నాటడంలో 91 శాతం పురోగతి
- 2.75 కోట్ల పండ్ల మొక్కల పంపిణీకి ప్రణాళిక

2



## ఆర్ఎస్ఎస్‌పై ఒవైసీ ఘాటు విమర్శలు

- ముస్లింలపై తియ్యటి మాటలు చెప్పడం మానండి
- ఆర్ఎస్ఎస్ పాత సిద్ధాంతాలను ప్రజలకు చెప్పాలి
- గోల్వాల్కర్ రచనలను ప్రస్తావిస్తూ విమర్శలు
- మైనారిటీలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపణ
- ప్రపంచానికి ఒక మాట.. కార్యకర్తలకు మరో మాట అన్న ఒవైసీ

2

## కులగణనలో ప్రతి కులానికి యూనిక్ కోడ్

- దేశవ్యాప్తంగా కులగణనను తప్పనిసరి చేయాలని డిమాండ్
- ప్రతి కులానికి ప్రత్యేక కోడ్‌తోనే జనగణన చేపట్టాలి
- ఓబీసీలు, జనరల్ వర్గాలకు ప్రత్యేక కాలమ్‌లు ఏర్పాటు చేయాలి
- శాస్త్రీయ విధానం లేకుంటే రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా
- డిమాండ్లు పట్టించుకోకుంటే దేశవ్యాప్త ఉద్యమం

2






## నేపాల్‌లో తెలంగాణవారి కోసం సమన్వయం

- వరద బాధితుల ఆచూకీ కోసం కేంద్రంతో తెలంగాణ భవన్ నిరంతర సంప్రదింపులు
- సురక్షిత తరలింపు, పార్థివదేహాల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి
- టిబెట్ నుంచి నేపాల్ మీదుగా భారతీయుల తరలింపు
- తెలంగాణకు చెందిన అల్లి ఐయిలేష్ హైదరాబాద్‌కు చేరుకునే అవకాశం
- డీఎన్ఏ కోసం కుటుంబ సభ్యులు నేపాల్ వెళ్లాల్సిన అవసరం లేదని వెల్లడి

3

## మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం

- 'డోస్ట్ లిక్' పతకం ప్రదానం.. శాశ్వత భారత్–ఉజ్బెకిస్థాన్ బంధానికి అంకితం
- మోదీకి దక్కిన 36వ అంతర్జాతీయ పురస్కారం..
- ఈ గౌరవం 140 కోట్ల మంది భారతీయులదన్న ప్రధాని

4





## సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ

- ఉదయం 10 గంటలకు ఉభయ సభల సమావేశాలు ప్రారంభం
- అసెంబ్లీ కార్యదర్శి అధికారిక సర్క్యులర్ జారీ బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై చర్చకు సీఎం రేవంత్ సవాల్

2

# ఆర్ఎస్ఎస్‌పై ఒవైసీ ఘాటు విమర్శలు

**హైదరాబాద్, ఆగస్టు 30:**
భారత్‌లో ముస్లింలు ఉండకూడదని భావించే వారు హిందువులు కాదంటూ న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. ఆర్ఎస్ఎస్‌కు ప్రపంచం ముందు ఒకలా, తమ కార్యకర్తలకు మరోలా మాట్లాడటం పాత వ్యూహమని ఆరోపిస్తూ ఆదివారం ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు.

**పాత సిద్ధాంతాలేంటని ప్రశ్న**
ఆర్ఎస్ఎస్ భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని ఒవైసీ పేర్కొన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు హెడ్గేవార్ గాంధీజీ నాయకత్వంలోని హిందూముస్లిం ఐక్యతను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చారని, ఆ విషయాన్ని ఆర్ఎస్ఎస్ ప్రచురించిన ఆయన జీవిత చరిత్రలోనే పేర్కొన్నారని తెలిపారు.

**గోల్వాల్కర్ రచనలను ప్రస్తావిస్తూ**
ఆర్ఎస్ఎస్ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని ఒవైసీ ఆరోపించారు. 1940లో ఎం.ఎస్. గోల్వాల్కర్ ఒకే జెండా, ఒకే నాయకుడు, ఒకే సిద్ధాంతం గురించి పేర్కొన్నారని తెలిపారు. గోల్వాల్కర్ రచించిన 'బంచ్ ఆఫ్ థాట్స్'లోని 'ఇంటర్నల్ థ్రెట్స్' అధ్యాయాన్ని ప్రస్తావిస్తూ ముస్లింలు, క్రైస్తవులను దేశానికి ముప్పులుగా పేర్కొన్నారని విమర్శించారు.

**తియ్యటి మాటలు మానాలని డిమాండ్**
ఉమ్మడి పౌరస్మృతి, మతమార్పిడి నిరోధక చట్టాలు, యూఏపీఏ వంటి అంశాలను ప్రస్తావిస్తూ మైనారిటీలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఒవైసీ ఆరోపించారు. 2002 గుజరాత్ అల్లర్లలో ముస్లింలపై జరిగిన హింసను కూడా ప్రస్తావించారు. భగవత్ బయటకు తియ్యటి మాటలు చెప్పడం మానుకుని హెడ్గేవార్, గోల్వాల్కర్, సావర్కర్ రచనల్లోని అంశాలను ప్రజలకు బహిరంగంగా చదివి వినిపించాలని ఒవైసీ డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్ అసలు సిద్ధాంతాన్ని ప్రజలు అప్పుడే అర్థం చేసుకుంటారని వ్యాఖ్యానించారు.




# కులగణనలో ప్రతి కులానికి యూనిక్ కోడ్

**హైదరాబాద్, ఆగస్టు 30:**
దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణనలో కులగణనను తప్పనిసరి చేయడంతో పాటు ప్రతి కులానికి ప్రత్యేకంగా యూనిక్ కోడ్ కేటాయించాలని పలువురు మేధావులు, రాజకీయ నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్త ఏకాభిప్రాయం వచ్చే వరకు జనగణన ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం 'జనగణనలో కులగణన-ప్రతి కులానికి యూనిక్ కోడ్' ప్రధాన డిమాండ్‌తో ఓబీసీ జాతీయ సదస్సు నిర్వహించారు. బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్, మాజీ ఐఏఎస్ టి. చిరంజీవులు, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి. కిరణ్ కుమార్ అధ్యక్షతన సదస్సు జరిగింది.

**ప్రత్యేక కోడ్‌తోనే గణన**
ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించకుండా కులగణన నిర్వహించడం శాస్త్రీయ విధానం కాదని సదస్సులో వక్తలు అభిప్రాయపడ్డారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల తరహాలో ఓబీసీలు, జనరల్ వర్గాలకు కూడా ప్రత్యేక కాలమ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.
డ్రాప్‌డౌన్ మెనూ ద్వారా ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించిన తర్వాతే జనగణన ప్రక్రియను ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

**సదస్సుకు పలువురు నేతలు**
రాజ్యసభ ఎంపీ విల్సన్, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, ఏఐసీసీ ఓబీసీ విభాగం చైర్మన్ అనిల్ జైహింద్, స్వరాజ్ ఇండియా నేత ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ రతన్ లాల్, ప్రొఫెసర్ సూరజ్ మండల్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగొని బాలరాజ్ గౌడ్, ఎస్. దుర్గయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా**
శాస్త్రీయ ప్రణాళిక లేకుండా జనగణన చేపడితే కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తున్న సుమారు రూ.12,800 కోట్ల ప్రజాధనం వృథా అయ్యే అవకాశం ఉందని ప్రొఫెసర్ సూరజ్ మండల్, ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ఎంపీ విల్సన్ హెచ్చరించారు.
ప్రతి కులాన్ని కచ్చితంగా నమోదు చేసేలా పారదర్శక, శాస్త్రీయ విధానాన్ని కేంద్రం తక్షణమే అమలు చేయాలని కోరారు. తమ డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ముందుకు వెళ్తే దేశవ్యాప్తంగా విస్తృత ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.

# మూసారాంబాగ్ బ్రిడ్జి పూర్తి

**హైదరాబాద్, ఆగస్టు 30:**
చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మూసారాంబాగ్ బ్రిడ్జి నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. మూసారాంబాగ్ వద్ద మూసీ నదిపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం 2022లో పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. రూ.52 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో 400 మీటర్ల పొడవైన వంతెనను నిర్మించారు. 14.5 మీటర్ల వెడల్పుతో నిర్మించిన వంతెనపై పాదచారుల కోసం 3.5 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్ ఏర్పాటు చేశారు.

**ఏడాది పొడవునా రాకపోకలు**
వంతెన అందుబాటులోకి రావడంతో అంబర్‌పేట్-మూసారాంబాగ్ మధ్య అన్ని కాలాల్లో రాకపోకలకు అవకాశం కలగనుంది. ముఖ్యంగా వర్షాకాలంలో మూసీ నదికి వరదలు వచ్చినప్పుడు ఏర్పడే నీటి ముంపు, రాకపోకల అంతరాయాలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.రెండు ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడి ప్రజలకు సురక్షితమైన, నిరంతరాయ ప్రయాణం అందుబాటులోకి రానుంది.

**కమిషనర్ కర్ణన్ సమీక్ష**
మూసారాంబాగ్ వంతెనతో పాటు నల్గొండ ఫ్లైఓవర్ పనులను జీహెచ్ఎంసీ కమిషనర్



ఆర్వీ. కర్ణన్ ఆదివారం తనిఖీ చేశారు. రెండు ప్రాజెక్టుల పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మూసారాంబాగ్ బ్రిడ్జి ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

**చంచల్‌గూడ ఫ్లైఓవర్ పనులు**
చంచల్‌గూడ ఫ్లైఓవర్ ప్రధాన నిర్మాణం పూర్తయిందని కమిషనర్ తెలిపారు. ప్రారంభోత్సవానికి మార్గం సుగమం చేసేలా ఏ4 అప్ ర్యాంప్ పనులను ఆదివారమే పూర్తి చేయాలని ఆదేశించారు. చంపాపేట్ వైపు వెళ్లే ఏ3 సైడ్ ర్యాంప్ పనులను రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే చంచల్‌గూడ, సైదాబాద్, సంతోష్‌నగర్, ఐఎస్ సదన్, ఒవైసీ ఆస్పత్రి, కంచన్‌బాగ్, చంపాపేట్, సాగర్ రోడ్ మార్గాల్లో ప్రయాణించే వారికి గణనీయమైన ఉపశమనం లభిస్తుందని కర్ణన్ తెలిపారు.

# వెయ్యి రోజుల్లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ

**హైదరాబాద్, ఆగస్టు 30:**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకోవడం రాష్ట్ర ప్రస్థానంలో కీలక మైలురాయని రాష్ట్ర మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ వెయ్యి రోజుల్లో ప్రభుత్వం మారడమే కాకుండా తెలంగాణ ప్రజలు పోరాడి సాధించుకున్న ప్రజాస్వామ్య స్ఫూర్తి పునరుద్ధరించబడిందని పేర్కొన్నారు.
ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అధికారం ఒక వ్యక్తి, ఒక కుటుంబం చేతుల్లో కేంద్రీకృతమైందని ఆరోపించారు.

**ప్రజలకు చేరువైన పాలన**
మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రతిపక్షాలు, సామాన్య ప్రజల గొంతుకకు కూడా గత పాలనలో విలువ లేకుండా పోయిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. సచివాలయాన్ని ప్రజలకు దూరం చేసి, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచారని ఆరోపించారు.
కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిరంకుశ సంస్కృతికి ముగింపు పలికిందని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంటోందని, మంత్రులు ప్రజల మధ్యకు వెళ్తున్నారని, శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చలు జరుగుతున్నాయని చెప్పారు.
ప్రజావాణి, గ్రామసభలు, ప్రత్యక్ష ప్రజా సంప్రదింపుల ద్వారా పాలనను ప్రజల ముంగిటకు తీసుకువచ్చామని పేర్కొన్నారు.

**సంక్షేమానికి పెద్దపీట**
ప్రజాస్వామ్య పునరుద్ధరణతో పాటు పలు సంక్షేమ పథకాలను అమలు చేశామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పౌర సరఫరాల రంగంలో కీలక సంస్కరణలు చేపట్టామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.42 కోట్ల మందికి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అర్హులైన లక్షలాది కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి, ఆధునిక స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించామని తెలిపారు.
రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాలు,



వ్యవసాయ కూలీలు, బలహీనవర్గాలను ప్రభుత్వ విధానాలకు కేంద్రబిందువుగా మార్చామని పేర్కొన్నారు.

**సామాజిక న్యాయమే లక్ష్యం**
సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి తెలిపారు. సమగ్ర కులగణన, ఎస్సీ వర్గీకరణలో సాధించిన పురోగతి సామాజిక న్యాయం పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని స్పష్టం చేశారు.
గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిగిల్చిన భారీ అప్పులు, బడ్జెట్ వెలుపలి రుణాలు, పెండింగ్ బకాయిలు, అసంపూర్తి ప్రాజెక్టులతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిడిలో ఉందని తెలిపారు.
అయినప్పటికీ భారీ రుణాలు, వడ్డీలు చెల్లిస్తూ సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించడంతో పాటు అభివృద్ధికి పెట్టుబడులను పెంచామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

**కుటుంబ పాలనకు ముగింపు**
బీఆర్ఎస్‌కు ఆందోళనలు చేసే స్వేచ్ఛ ఉండటమే తెలంగాణలో ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడిందనడానికి నిదర్శనమని మంత్రి అన్నారు. అయితే తమ వెయ్యి రోజుల ప్రభుత్వ విజయాలను ప్రతిపక్షాలు చెరిపివేయలేవని స్పష్టం చేశారు. కుటుంబ పాలన నుంచి ప్రజా పాలన వైపు తెలంగాణ నిర్ణయాత్మకంగా అడుగులు వేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# వన మహోత్సవం.. ప్రజా ఉద్యమంగా మారాలి

**హైదరాబాద్, ఆగస్టు 30:**
వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా పచ్చని, ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణానికి ప్రజా ఉద్యమంగా మలచాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు.
ఆదివారం ప్రజాభవన్‌లో కమిషనర్ దివ్య దేవరాజన్, ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మితో కలిసి వన మహోత్సవం పురోగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు.
జిల్లాల వారీగా మొక్కల పంపిణీ, గుంతల తవ్వకం, మొక్కల మనుగడ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**లక్ష్యానికి చేరువగా**
ఈ ఏడాది 6.18 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 5.61 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు అధికారులు మంత్రికి వివరించారు.
గుంతల తవ్వకంలో 92 శాతం, మొక్కలు నాటడంలో 91 శాతం పురోగతి సాధించినట్లు



తెలిపారు. అధికారుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన సీతక్క.. వాతావరణం అనుకూలంగా ఉన్న ప్రస్తుత సమయంలో మిగిలిన లక్ష్యాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**మొక్కల సంరక్షణే ముఖ్యం**
మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని మంత్రి స్పష్టం చేశారు. వాటికి క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించినప్పుడే వన మహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు.
నాటిన ప్రతి మొక్క మనుగడ సాధించేలా గ్రామస్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

**కుటుంబ ఆరోగ్యానికి పండ్ల మొక్కలు**
పండ్ల కోసం మార్కెట్లపైనే ఆధారపడకుండా ఇంటి ఆవరణలోనే పండ్ల మొక్కలను పెంచుకోవడం ద్వారా కుటుంబ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని సీతక్క సూచించారు.
మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు స్వచ్ఛమైన పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ఈ ఏడాది 2.75 కోట్ల పండ్ల మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.
జామ, ఉసిరి, మామిడి, సీతాఫలం, మునగ వంటి మొక్కలను ఇళ్ల వద్ద పెంచుకోవడం ద్వారా స్వచ్ఛమైన గాలితో పాటు పోషకాహారం కూడా లభిస్తుందని తెలిపారు.
పంపిణీ చేసిన మొక్కలు వృథా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామస్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బందిపై ఉందని స్పష్టం చేశారు. ప్రతి మొక్కను ఇంటి సభ్యుడిలా ప్రేమగా పెంచుకుంటూ పచ్చని గ్రామాలకు, ఆరోగ్యకరమైన సమాజానికి ప్రజలంతా బలమైన పునాది వేయాలని మంత్రి సీతక్క కోరారు.

# సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ

**హైదరాబాద్, ఆగస్టు 30:**
తెలంగాణ శాసనసభ, శాసన మండలి వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ఉభయ సభల సమావేశాలు ప్రారంభం కానున్నట్లు అసెంబ్లీ కార్యదర్శి అధికారిక సర్క్యులర్ జారీ చేశారు.
సెప్టెంబర్ 7న ఉదయం 10 గంటలకు శాసనసభ, శాసన మండలి సమావేశాలు ప్రారంభమవుతాయని అధికారులు సభ్యులకు సమాచారం అందించారు.

**సీఎం ముందే ప్రకటన**
వర్షాకాల అసెంబ్లీ సమావేశాలను సెప్టెంబర్‌లో నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ కార్యదర్శి సమావేశాల ప్రారంభ తేదీని అధికారికంగా వెల్లడించారు.

**బీఆర్ఎస్ పాలనపై చర్చకు సవాల్**
గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై సభలో విస్తృతంగా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.
ఈ చర్చలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అసెంబ్లీకి వచ్చి పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు.

**పలు అంశాలపై చర్చ**
ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సాగునీటి ప్రాజెక్టులు తదితర అంశాలు సమావేశాల్లో చర్చకు వచ్చే అవకాశం ఉంది.
రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాలు, వివిధ సామాజిక అంశాల నేపథ్యంలో సెప్టెంబర్ 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలు కీలకంగా మారనున్నాయి.
సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీవేడిగా చర్చలు జరిగే అవకాశం ఉండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



# ఆన్‌లైన్‌లో బీఆర్ఎస్.. ఆన్‌గ్రౌండ్‌లో రేవంత్

మొదటిపేజీ తరువాయి
వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు క్షుద్ర పూజలు చేయిస్తున్నారంటూ చేసిన ఆరోపణలు, సొంత పార్టీ నేతలపైనే తీవ్రంగా వ్యవహరిస్తున్నారంటూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.
ఇలాంటి వ్యాఖ్యలు ప్రసంగ వేదికలకే పరిమితం కాకుండా టీవీ చర్చలు, యూట్యూబ్ వీడియోలు, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం అవుతున్నాయి. దీంతో ఆన్‌లైన్‌లో బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారానికి తనదైన రీతిలో సమాధానం ఇవ్వడమే కాకుండా, ప్రజల్లో రాజకీయ చర్చను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**గ్రామీణ ప్రాంతాలపై దృష్టి**
బీఆర్ఎస్ డిజిటల్ ప్రచారం పట్టణ ప్రాంతాలు, యువత, విద్యావంతులైన ఓటర్లలో ఎక్కువగా కనిపిస్తున్నప్పటికీ.. తెలంగాణ గ్రామీణ రాజకీయాల్లో నాయకుడి ప్రత్యక్ష హాజరు, స్థానిక కార్యకర్తలతో అనుసంధానం, ప్రజలతో ముఖాముఖి సంబంధాలు ఇప్పటికీ కీలకంగా ఉన్నాయి. రేవంత్ రెడ్డి ఇదే అంశాన్ని తన రాజకీయ వ్యూహంలో ప్రధానంగా మలుచుకుంటున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాలకు వెళ్లి సభల్లో మాట్లాడటం, స్థానిక సమస్యలను ప్రస్తావించడం, ప్రతిపక్షంపై విమర్శలు చేయడం ద్వారా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపడంతో పాటు ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నం జరుగుతోంది.

**వ్యూహంలో ముప్పులూ ఉన్నాయి**
అయితే రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న ఘాటు వ్యాఖ్యల వ్యూహానికి ప్రతికూలతలు కూడా లేకపోలేదు. తరచూ వివాదాస్పద వ్యాఖ్యలే ప్రధాన చర్చగా మారితే.. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పనితీరు వంటి అసలు అంశాలు వెనుకబడే అవకాశం ఉంది. మరోవైపు రేవంత్ ప్రసంగాల్లోని వివాదాస్పద వ్యాఖ్యలను బీఆర్ఎస్ డిజిటల్ బృందం చిన్న వీడియోలుగా మార్చి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తోంది.

**ఆన్‌స్క్రీన్‌లో బీఆర్ఎస్.. ఆన్‌గ్రౌండ్‌లో కాంగ్రెస్**
ప్రస్తుతం తెలంగాణలో ప్రచార పోరును చూస్తే బీఆర్ఎస్ సామాజిక మాధ్యమాల్లో దూకుడుగా వ్యవహరిస్తుండగా.. రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయిలో తన బలాన్ని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే దీర్ఘకాలంలో కాంగ్రెస్ కేవలం ముఖ్యమంత్రి పర్యటనలు, ప్రసంగాలపై ఆధారపడకుండా తన డిజిటల్ వ్యవస్థను కూడా బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది.
ఎన్నికల రాజకీయాల్లో సామాజిక మాధ్యమాల ప్రచారం వేగంగా ప్రభావం చూపించినా.. ప్రజలను నేరుగా కలుసుకోవడం, కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం, క్షేత్రస్థాయిలో రాజకీయ సంబంధాలను బలోపేతం చేయడం దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే అంశాలుగా నిలుస్తాయి. దీంతో ప్రస్తుతానికి బీఆర్ఎస్ డిజిటల్ దాడికి దీటుగా రేవంత్ రెడ్డి తన ప్రత్యక్ష రాజకీయ దూకుడును అస్త్రంగా మలుచుకుంటున్నారని చెప్పవచ్చు.

# రియల్‌ఎస్టేట్ సంస్థగా కాంగ్రెస్ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

**రూ.500 కోట్ల భూమి రూ.87 కోట్లకే**
హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సమీపంలోని అజామాబాద్‌లో ఆయిల్‌ఫెడ్ సంస్థకు చెందిన 3 ఎకరాల 23 గుంటల భూమి ఉందని హరీశ్ రావు తెలిపారు.
15,984 గజాల విస్తీర్ణంలోని ఈ భూమి బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.500 కోట్ల విలువ చేస్తుందని పేర్కొన్నారు.
అలాంటి విలువైన భూమిని కేవలం రూ.87 కోట్లకే ప్రైవేటు వ్యక్తికి అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని ఆరోపించారు.
రూ.87 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్‌ఫెడ్ సిద్ధంగా ఉన్నప్పటికీ, దానిని పక్కనబెట్టి ప్రైవేటు వ్యక్తికి భూమిని కట్టబెట్టడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**సుప్రీంకోర్టు తీర్పును విస్మరణ**
1987లో ప్రైవేటు సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందని హరీశ్ రావు గుర్తుచేశారు.
ఆ భూమిపై పూర్తి హక్కు ప్రభుత్వానిదేనని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసిందని తెలిపారు.
బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎలాంటి ప్రైవేటు శక్తులకు తలొగ్గకుండా వందల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని కాపాడామని పేర్కొన్నారు.
ఒకవైపు సామాన్యుల ఇళ్లను 22ఏ జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ నాయకులు, మరోవైపు కోకాపేట, రాయదుర్గం, గచ్చిబౌలి, అజామాబాద్‌లోని ఖరీదైన ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారని విమర్శించారు.

**నిర్ణయం వెనక్కి తీసుకోవాలి**
స్వార్థ ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఆస్తులను ఇలాగే విక్రయిస్తూ పోతే భవిష్యత్తులో బడికి, గుడికి, చివరకు స్మశానానికి కూడా స్థలం మిగలదని హరీశ్ రావు హెచ్చరించారు.
అజామాబాద్ భూముల కేటాయింపును ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ భూమికి సంబంధించిన పూర్తి ఫ్రీ హోల్డ్ హక్కులను ఆయిల్‌ఫెడ్‌కే కల్పించాలని కోరారు. ప్రజల సొత్తును ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు న్యాయపోరాటంతో పాటు ప్రజాక్షేత్రంలోనూ మహా పోరాటం చేస్తామని హరీశ్ రావు హెచ్చరించారు.

# నేపాల్‌లో తెలంగాణవారి కోసం సమన్వయం

హైదరాబాద్, ఆగస్టు 30:

నేపాల్‌లో సంభవించిన వరద విపత్తు నేపథ్యంలో తెలంగాణకు చెందిన వారి ఆచూకీ, సురక్షిత తరలింపు, పార్థివదేహాల గుర్తింపు, స్వదేశానికి తరలింపు అంశాలపై తెలంగాణ భవన్ అధికారులు నిరంతర సమన్వయం కొనసాగిస్తున్నారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఖాఠ్మాండూలోని భారత రాయబార కార్యాలయం, నేపాల్ పోలీసులతో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.



**భారతీయుల తరలింపు**

భారత విదేశాంగ శాఖ అధికారుల వివరాల ప్రకారం ఆగస్టు 29న టిబెట్ నుంచి నేపాల్‌కు 449 మంది భారతీయులు చేరుకున్నారు. ఆగస్టు 30న మరో 397 మందిని అదే మార్గంలో తరలించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ జాబితాలో తెలంగాణకు చెందిన అల్లి ఐయిలేష్ పేరు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆయన పాస్‌పోర్టు వివరాలు తెలంగాణ భవన్ వద్ద ఉన్న రికార్డులతో సరిపోలాయి. ప్రస్తుతం ఆయన కుటుంబ సభ్యులతో సంప్రదింపుల్లో ఉన్నారని, ఆదివారం రాత్రి సుమారు 10 గంటలకు హైదరాబాద్‌కు చేరుకునే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

**నేపాల్ వెళ్లాల్సిన అవసరం లేదు**

నేపాల్ ప్రభుత్వం మృతుల ఛాయాచిత్రాలు, ప్రాథమిక వివరాలను నేపాల్ పోలీసుల డిజాస్టర్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచింది. రసువా, నువాకోట్, ధాదింగ్, చిత్వన్, గోర్ఖా, తనహున్, నావల్పరాసీ తూర్పు, నావల్పరాసీ పశ్చిమ, ఖాఠ్మాండూ జిల్లాల్లో భద్రపరిచిన పార్థివదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది.

కుటుంబ సభ్యులు ప్రత్యక్షంగా గుర్తించగలిగితే డీఎన్ఏ పరీక్ష తప్పనిసరి కాదని నేపాల్ పోలీసులు తెలిపారు. మృతుడితో బంధుత్వాన్ని నిర్ధారించే ఆధారాలను పరిశీలించిన అనంతరం పార్థివదేహాన్ని సంబంధిత కుటుంబానికి అప్పగించనున్నారు. ప్రత్యక్ష గుర్తింపు సాధ్యం కాని సందర్భాల్లో తల్లిదండ్రులు, సోదరులు, సోదరీమణులు వంటి తొలి స్థాయి బంధువుల డీఎన్ఏ ప్రొఫైల్‌ను సరిపోల్చనున్నారు. ఇందుకోసం బంధువులు నేపాల్‌కు వెళ్లాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. స్వస్థలంలో సిద్ధం చేసిన డీఎన్ఏ ప్రొఫైల్‌ను సమర్పించే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన ఈమెయిల్ విధానాన్ని నేపాల్ పోలీసులు రూపొందిస్తున్నారు.

**అధికారిక నిర్ధారణ తర్వాతే సమాచారం**

పార్థివదేహాల గుర్తింపు, కుటుంబాలకు అప్పగింత, స్వదేశానికి తరలింపునకు సంబంధించిన పూర్తి విధివిధానాలను నేపాల్ అధికారులు ఖరారు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు కుటుంబ సభ్యులు స్వయంగా నేపాల్‌కు వెళ్లకుండా తెలంగాణ భవన్, భారత రాయబార కార్యాలయంతో సంప్రదించాలని అధికారులు సూచించారు. ప్రతి కేసులో అధికారిక నిర్ధారణ పూర్తయిన తర్వాతే సంబంధిత కుటుంబాలకు, ప్రజలకు తదుపరి సమాచారం అందిస్తామని అధికారులు వెల్లడించారు.

# నీట్ పీజీలో ఆల్ ఇండియా కోటా తగ్గించాలి

- **మాజీ ఎంపీ, వినోద్ కుమార్ లేఖ**
- **తెలంగాణలో పెరిగిన ప్రభుత్వ వైద్య కళాశాలలు, పీజీ సీట్లు**
- **రాష్ట్ర నిధులతో ఏర్పాటైన సీట్లలో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్**
- **ఏఐక్యూ కింద రాష్ట్రాల వారీగా పారదర్శక గణాంకాలు విడుదల చేయాలి**
- **సమతుల్య సమాఖ్య విధానం అవసరమని సూచన**

హైదరాబాద్, ఆగస్టు 30:

నీట్ పీజీలో ప్రస్తుతం అమల్లో ఉన్న 50 శాతం ఆల్ ఇండియా కోటాను 15 శాతానికి తగ్గించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డాను కోరారు. దేశవ్యాప్తంగా జరిగిన నీట్ పీజీ పరీక్ష సందర్భంగా తెలంగాణ వైద్య విద్యార్థులు, వైద్యుల నుంచి అందిన సమాచారం, వారి ఆందోళనల నేపథ్యంలో ఈ మేరకు కేంద్ర మంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు.



**రాష్ట్ర నిధులతో వైద్య విద్య**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం జిల్లాల వారీగా పలు కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేసిందని వినోద్ కుమార్ తెలిపారు. వైద్య విద్యతో పాటు పీజీ సీట్ల సంఖ్యను కూడా గణనీయంగా పెంచిందని పేర్కొన్నారు. ఈ వైద్య కళాశాలలు, సీట్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రజల నిధులు, ప్రభుత్వ వనరులు వినియోగిస్తున్నందున వాటిలో అధిక భాగం తెలంగాణ వైద్య విద్యార్థులకు అందుబాటులో ఉండేలా విధానం రూపొందించాలని కోరారు.

**కోటాలో సమతుల్యత అవసరం**

నీట్ పేజీలో లో 15 శాతం ఏఐక్యూ అమల్లో ఉండగా, నీట్ పీజీలో 50 శాతం ఏఐక్యూ కొనసాగడం సమతుల్యంగా లేదని వినోద్ కుమార్ అభిప్రాయపడ్డారు. పీజీ వైద్య విద్యలోనూ ఏఐక్యూను 15 శాతానికి తగ్గించాలని కేంద్ర మంత్రిని కోరారు.

**రాష్ట్రాల వారీగా గణాంకాలు**

ప్రతి రాష్ట్రం నుంచి ఏఐక్యూకు ఎన్ని ప్రభుత్వ పీజీ సీట్లు వెళ్తున్నాయి, ఇతర రాష్ట్రాలకు చెందిన ఎంతమంది విద్యార్థులు ఆయా సీట్లను పొందుతున్నారనే వివరాలను రాష్ట్రాల వారీగా పారదర్శకంగా వెల్లడించాలని వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రస్తుత ఏఐక్యూ విధానంపై సమగ్ర సమీక్ష నిర్వహించి, రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మార్పులు చేయాలని కోరారు.

**సమాఖ్య విధానం అవసరం**

ఈ డిమాండ్ తెలంగాణకు మాత్రమే పరిమితం కాదని వినోద్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రాలు తమ ప్రజా నిధులతో అభివృద్ధి చేస్తున్న వైద్య విద్యా మౌలిక వసతులకు అనుగుణంగా పీజీ సీట్లలో రాష్ట్ర విద్యార్థులకు సముచిత వాటా లభించేలా సమతుల్యమైన సమాఖ్య విధానం అవసరమని ఆయన స్పష్టం చేశారు.

# భారత వైద్య వ్యవస్థపై విదేశీ అనుభవంతో డాక్టర్ ప్రశంసలు

- **బ్రిటన్‌తో పోల్చిన వైద్యురాలి వీడియో వైరల్**
- **అర్ధరాత్రి కూడా మందులు సులభంగా లభించడంపై ప్రస్తావన**
- **వైద్య సేవల్లో భారత్‌కు ఉన్న సౌలభ్యాన్ని వివరించిన డాక్టర్**
- **భారత వైద్య వ్యవస్థలోనూ లోపాలు ఉన్నాయని స్పష్టీకరణ**
- **వీడియోపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న నెటిజన్లు**

హైదరాబాద్, ఆగస్టు 30:

భారత్, యునైటెడ్ కింగ్‌డమ్‌లో వైద్య సేవల లభ్యతను పోలుస్తూ భారతీయ వైద్యురాలు డాక్టర్ దీపాంజలి శర్మ చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రాత్రివేళ తన భర్తకు అకస్మాత్తుగా అనారోగ్యం రావడంతో మందులు, ఐవీ ఇంజెక్షన్ల కోసం బయటకు వెళ్లిన ఆమె.. ఆ సమయంలో భారత్‌లో ఉండటం ఎంత సౌకర్యంగా ఉందో వివరించారు.

**రాత్రి వేళ మందుల కోసం బయటకు**

డాక్టర్ శర్మ భర్త కూడా వైద్యుడే. ఆయనకు తొలుత తలనొప్పి రావడంతోపాటు వరుసగా వాంతులు కావడంతో ఆమె రాత్రి 10 గంటల సమయంలో మందుల కోసం బయటకు వెళ్లారు. అవసరమైన మందులు, ఐవీ ఇంజెక్షన్లు తీసుకుని తిరిగి ఇంటికి చేరుకునే అవకాశం భారత్‌లో ఉండటం తనకు గొప్ప విషయంగా అనిపించిందని ఆమె పేర్కొన్నారు.

**పాశ్చాత్య దేశాల్లో భిన్న పరిస్థితులు**

బ్రిటన్‌తో పాటు ఇతర పాశ్చాత్య దేశాల్లో సాధారణ పని వేళలు దాటిన తర్వాత అత్యవసర వైద్య సహాయం, కొన్ని మందులు పొందడం కష్టంగా ఉంటుందని డాక్టర్ శర్మ తెలిపారు. అత్యవసర విభాగాల్లో ఇప్పటికే రద్దీ, ఒత్తిడి ఉండటంతో వెంటనే వైద్య సహాయం అందడం కష్టమయ్యే అవకాశం ఉందన్నారు. మందులు కూడా వెంటనే లభించకపోవచ్చని చెప్పారు.

**భారత్‌లో సౌలభ్యమే బలమని వ్యాఖ్య**

భారత్‌లో అర్ధరాత్రి అయినా బయటకు వెళ్లి అవసరమైన మందులు తీసుకొచ్చి, తిరిగి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యుడిని చూసుకునే అవకాశం ఉండటాన్ని ఆమె ప్రస్తావించారు. 24 గంటల ఫార్మసీలు, అందుబాటులో ఉండే వైద్య సేవలు భారత వైద్య వ్యవస్థకు ఉన్న సౌలభ్యాన్ని చూపుతున్నాయని చెప్పారు.



**లోపాలు లేవని చెప్పడం లేదని స్పష్టీకరణ**

భారత వైద్య వ్యవస్థలో ఎలాంటి లోపాలు లేవని తాను చెప్పడం లేదని డాక్టర్ శర్మ స్పష్టం చేశారు. ఇంకా మెరుగుపరచాల్సిన అంశాలు ఉన్నాయని, ఏ దేశంలోనూ వైద్య సేవలు పూర్తిగా పరిపూర్ణంగా ఉండవని పేర్కొన్నారు. అయితే భారత్‌లో సాధారణ ప్రజలకు వైద్య సేవలు, మందులు సులభంగా అందుబాటులో ఉండటం ఒక ప్రత్యేకతగా అభిప్రాయపడ్డారు.

**నెటిజన్ల నుంచి భిన్న స్పందనలు**

డాక్టర్ శర్మ వీడియోపై నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. భారత్‌లో 24 గంటల ఫార్మసీలు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో మందులు త్వరగా పొందగలుగుతున్నామని పలువురు పేర్కొన్నారు. అయితే ప్రిస్క్రిప్షన్ లేకుండానే కొన్ని మందులు సులభంగా లభించడం వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని మరికొందరు ఆందోళన వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఇక క్రాస్ వాల్యుయేషన్

హైదరాబాద్, ఆగస్టు 30:

తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత కచ్చితంగా అంచనా వేసేందుకు విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై విద్యార్థుల జవాబు పత్రాలను అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు కాకుండా ఇతర పాఠశాలల ఉపాధ్యాయులతో మూల్యాంకనం చేయించే క్రాస్ వాల్యుయేషన్ విధానాన్ని అమలు చేయనున్నారు.



**నిష్పక్షపాత మూల్యాంకనం**

1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించే SA1, SA2 పరీక్షల జవాబు పత్రాలతో పాటు 10వ తరగతి SA1 పరీక్ష పేపర్లను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు దిద్దరు. ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు వాటిని అప్పగించి మూల్యాంకనం చేయిస్తారు.

తమ వద్ద చదివే విద్యార్థుల జవాబు పత్రాలను ఉపాధ్యాయులు దిద్దే సమయంలో మార్కుల కేటాయింపులో హెచ్చుతగ్గులు జరిగే అవకాశం ఉంటుంది. క్రాస్ వాల్యుయేషన్ ద్వారా ఇలాంటి పక్షపాతానికి అడ్డుకట్ట వేసి, సమాధానాల ఆధారంగా ప్రామాణిక మార్కులు కేటాయించే అవకాశం ఉంటుంది.

**మండల కేంద్రాల్లో కేంద్రాలు**

క్రాస్ వాల్యుయేషన్‌ను సమర్థంగా నిర్వహించేందుకు ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేక మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో ఈ కేంద్రాలు పనిచేస్తాయి. ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను మూల్యాంకన విధులకు కేటాయించి జవాబు పత్రాల దిద్దుబాటు ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

**విద్యా సామర్థ్యంపై స్పష్టత**

నిష్పక్షపాతంగా వెలువడే ఫలితాల ద్వారా ప్రతి విద్యార్థి అసలైన విద్యా సామర్థ్యాన్ని గుర్తించేందుకు అవకాశం ఉంటుంది. అలాగే ఏయే అంశాల్లో విద్యార్థులు వెనుకబడి ఉన్నారో స్పష్టంగా తెలుసుకోవచ్చు.

ఈ ఫలితాల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన, రెమెడియల్ తరగతులు నిర్వహించేందుకు వీలు కలుగుతుంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు క్రాస్ వాల్యుయేషన్ విధానం దోహదపడుతుందని విద్యాశాఖ భావిస్తోంది.



# తెలంగాణలో గోదావరి పుష్కరాల నిర్వహణకు సన్నాహాలు

హైదరాబాద్, ఆగస్టు 30:

గోదావరి పుష్కరాలు అంటే రాజమహేంద్రవరం పేరు గుర్తుకొచ్చే పరిస్థితిని మార్చి, ఇకపై తెలంగాణతో గోదావరి పుష్కరాలకు ప్రత్యేక అనుబంధం ఏర్పడేలా వచ్చే ఏడాది ఉత్సవాలను నిర్వహించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. 'గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ.. తెలంగాణ అంటే గోదావరి పుష్కరాలు' అనేలా ఏర్పాట్లు ఉండాలని సూచించారు.

**రూ.1,000 కోట్లతో ఏర్పాట్లు**


2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.1,000 కోట్ల నిధులు మంజూరు చేశారని మంత్రి తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

**తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా**

పుష్కరాలకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు తెలంగాణ ఆతిథ్యం, సంస్కృతి, సంప్రదాయాలు పరిచయమయ్యేలా వసతులు కల్పించాలని సురేఖ సూచించారు. పుష్కర ఘాట్లు, భక్తుల రాకపోకలు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని చెప్పారు.

**సమన్వయానికి ప్రత్యేక కార్యాలయం**

గోదావరి పుష్కరాలు2027 పనుల సమన్వయం కోసం ప్రజాభవన్‌లోని మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన ప్రత్యేక అధికారి కార్యాలయాన్ని మంత్రి ఆదివారం ప్రారంభించారు. అనంతరం దేవాదాయ శాఖ అధికారులతో పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, దేవాదాయ శాఖల మధ్య సమన్వయానికి ఈ కార్యాలయం కేంద్ర బిందువుగా పనిచేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.




# నీట్ పీజీ పరీక్షలో కలకలం

- **సెక్యూరిటీ దాటుకుని మద్యం మత్తులో హాజరు**
- **పరీక్ష హాల్‌లో విద్యార్థి తీరుపై సిబ్బందికి అనుమానం**

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 30:

తెలంగాణలో నీట్ పీజీ పరీక్ష ప్రశాంతంగా ముగిసిన వేళ రంగారెడ్డి జిల్లాలో ఓ విద్యార్థి మద్యం మత్తులో పరీక్ష రాసేందుకు రావడం కలకలం రేపింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించగా అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకున్నారు. అయితే ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడలోని పరీక్ష కేంద్రంలో హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ రిజ్వాన్ మద్యం సేవించి పరీక్షకు హాజరైనట్లు గుర్తించారు.

**సెక్యూరిటీ దాటుకుని పరీక్ష హాల్‌లోకి**

రిజ్వాన్ సాధారణ తనిఖీలను దాటుకుని పరీక్ష హాల్‌లో తన సీటు వరకు వెళ్లాడు. అయితే అతడి ప్రవర్తనలో తేడా కనిపించడం తోపాటు మద్యం వాసన రావడంతో పరీక్ష సిబ్బందికి అనుమానం వచ్చింది. దీంతో అతడిని వెంటనే బయటకు పంపి మరోసారి క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

**బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష**

మరోసారి నిర్వహించిన తనిఖీలో రిజ్వాన్ మద్యం సేవించి వచ్చినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష నిర్వహించారు. మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**సెక్యూరిటీపై ప్రశ్నలు**

నీట్ పీజీ వంటి కీలక పరీక్షకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినప్పటికీ విద్యార్థి మద్యం మత్తులో పరీక్ష హాల్ వరకు చేరుకోవడం చర్చనీయాంశంగా మారింది. పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించే ముందు తనిఖీల తీరుపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# నార్త్ సైప్రస్ తీరంలో ఫెర్రీ బోల్తా

- **వెంటనే రంగంలోకి దిగిన సహాయక బృందాలు**
- **ప్రయాణికుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు**
- **ప్రాణనష్టంపై ఇంకా అధికారిక సమాచారం లేదు**

కైరేనియా, ఆగస్టు 30:

నార్త్ సైప్రస్ తీరంలో ఆదివారం సుమారు 270 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఫెర్రీ సముద్రంలో బోల్తాపడింది. నౌకలోకి ఒక్కసారిగా నీరు చేరడంతో ప్రమాదం జరిగినట్లు టర్కిష్ సైప్రియట్, టర్కీ మీడియా సంస్థలు వెల్లడించాయి. ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు సెర్చ్ అండ్ రెస్క్యూ చర్యలు ప్రారంభించారు. ఇప్పటివరకు ప్రాణనష్టం జరిగినట్లు అధికారిక సమాచారం లేదు.

**మార్గమధ్యంలో నీరు చేరడంతో**


కాటమరాన్ తరహా ఫెర్రీ నార్త్ సైప్రస్‌లోని కైరేనియా పోర్టు నుంచి టర్కీలోని మెర్సిన్ ప్రావిన్స్‌లోని తసూకు పోర్టుకు బయలుదేరింది. తీరానికి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉండగా నౌకలోకి నీరు చేరడం ప్రారంభమైంది. దీంతో కొద్దిసేపటికే ఫెర్రీ అదుపుతప్పి సముద్రంలో బోల్తాపడినట్లు టర్కీ ప్రభుత్వ ప్రసార సంస్థ తెలిపింది.

**మంత్రి ధ్రువీకరణ**

ఫెర్రీ ప్రమాదానికి గురైన విషయాన్ని నార్త్ సైప్రస్ రవాణా మంత్రి ఎర్హాన్ అరిక్లీ ధ్రువీకరించారు. ప్రమాద ప్రాంతానికి సహాయక బృందాలు చేరుకున్నాయని తెలిపారు.

**కొనసాగుతున్న సహాయక చర్యలు**

ప్రమాదం అనంతరం ప్రయాణికులను గుర్తించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు అధికారులు గాలింపు, సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు ఎంతమందిని రక్షించారు, ప్రయాణికుల పరిస్థితి ఏమిటన్న వివరాలను అధికారులు వెల్లడించలేదు.



# కెర్మెడెక్ దీవుల సమీపంలో భూకంపం

- **రిక్టర్ స్కేలుపై 5.8 తీవ్రతగా నమోదు**
- **సముద్రంలోనే భూకంప కేంద్రం**
- **న్యూజిలాండ్ ప్రాంతంలో ప్రకంపనలు**
- **సునామీ హెచ్చరికలు లేవు**

**కెర్మెడెక్ దీవులు, ఆగస్టు 30:**

న్యూజిలాండ్‌కు సమీపంలోని కెర్మెడెక్ దీవుల ప్రాంతంలో ఆదివారం భూకంపం సంభవించింది. సముద్రంలో చోటుచేసుకున్న ఈ ప్రకంపనల తీవ్రత 5.8గా నమోదైనట్లు తాజా భూకంప వివరాలు వెల్లడించాయి.

**సముద్ర గర్భంలో ప్రకంపనలు**

కెర్మెడెక్ దీవుల పరిసర ప్రాంతం భూకంప కార్యకలాపాలకు పేరుగాంచింది. తాజా ప్రకంపనలతో ఆ ప్రాంతంలో మరోసారి భూకంపం నమోదైంది. గతంలోనూ ఇక్కడ బలమైన భూకంపాలు సంభవించాయి.

**సునామీ ముప్పు లేదు**

భూకంపం సముద్ర ప్రాంతంలో సంభవించినప్పటికీ ప్రస్తుతానికి సునామీ ముప్పుపై ఎలాంటి హెచ్చరికలు వెలువడినట్లు తాజా సమాచారం లేదు.




# దేశమంతా ఇక ఒకే సమయం

- **మార్చి 2027 నుంచి IST తప్పనిసరి**
- **చట్టపరమైన, వాణిజ్య, డిజిటల్ వ్యవహారాలకు వర్తింపు**
- **ఆర్థిక లావాదేవీలు, టెలికాం, రవాణాపైనా ప్రభావం**
- **సైబర్ దాడుల నుంచి సమయ వ్యవస్థలకు రక్షణ**
- **ఉల్లంఘనలకు జరిమానా విధించే అవకాశం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 30:**

దేశంలో సమయ వినియోగానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2027 మార్చి నుంచి అన్ని సంస్థలు చట్టపరమైన, వాణిజ్య, డిజిటల్, పరిపాలనా అవసరాలకు భారత ప్రామాణిక సమయం (ఐఎస్‌టీ)నే తప్పనిసరిగా ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ మేరకు లీగల్ మెట్రాలజీ (ఇండియన్ స్టాండర్డ్ టైమ్) రూల్స్, 2026ను కేంద్రం ప్రకటించింది. గెజిట్ నోటిఫికేషన్ ప్రచురితమైన 180 రోజుల తర్వాత నిబంధనలు అమల్లోకి రానున్నాయి.

**అధికారిక వ్యవహారాల్లో ఐఎస్‌టీ**

కొత్త నిబంధనల ప్రకారం ప్రత్యేక మినహాయింపు ఉన్న సందర్భాలు మినహా చట్టపరమైన, పరిపాలనా, అధికారిక పత్రాలు, రికార్డుల్లో ఐఎస్‌టీనే సమయ ప్రమాణంగా ఉపయోగించాలి. వాణిజ్యం, రవాణా, ప్రభుత్వ పరిపాలన, చట్టపరమైన ఒప్పందాలు, ఆర్థిక లావాదేవీల్లోనూ ఇదే ప్రమాణాన్ని అనుసరించాలి.

**కొన్ని రంగాలకు మినహాయింపు**

విదేశీ సమయ మండలిని స్పష్టంగా పేర్కొనాల్సిన సందర్భాల్లో ఇతర సమయ ప్రమాణాలను ఉపయోగించేందుకు అవకాశం ఉంటుంది. శాస్త్రీయ పరిశోధనలు, నావిగేషన్, ఖగోళ శాస్త్ర కార్యకలాపాలు, ప్రభుత్వం ప్రత్యేకంగా అనుమతించిన సందర్భాలకు కూడా మినహాయింపులు వర్తిస్తాయి.

**డిజిటల్ వ్యవస్థలపై దృష్టి**

డిజిటల్ చెల్లింపులు, స్టాక్ మార్కెట్లు, టెలికాం నెట్‌వర్క్‌లు, 5జీ సేవలు, నావిగేషన్, విద్యుత్ గ్రిడ్‌లు, డేటా కేంద్రాలు వంటి కీలక వ్యవస్థలు అత్యంత ఖచ్చితమైన సమయ సమకాలీకరణపై ఆధారపడి పని చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఒకే సమయ ప్రమాణం అమలు చేయడం ద్వారా లావాదేవీల నమోదు, వ్యవస్థల మధ్య సమన్వయం, నెట్‌వర్క్‌ల విశ్వసనీయత మెరుగుపడుతుందని కేంద్రం భావిస్తోంది.

**సైబర్ భద్రతకు ప్రాధాన్యం**

సమయ సమకాలీకరణ వ్యవస్థలను సురక్షితంగా నిర్వహించడంతోపాటు స్పూఫింగ్, జామింగ్ వంటి సైబర్ దాడుల నుంచి వాటిని రక్షించాల్సి ఉంటుంది. ఒకటి కంటే ఎక్కువ అధీకృత సమయ వనరులను ఉపయోగించడం, సమయ వ్యవస్థ విఫలమైనప్పుడు పనిచేసే ప్రత్యామ్నాయ వ్యవస్థలను ఏర్పాటు చేయడం వంటి చర్యలకు నిబంధనలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. అవసరమైన చోట అటామిక్ క్లాక్‌ల వంటి అత్యంత ఖచ్చితమైన సమయ వనరులను వినియోగించాల్సి ఉంటుంది.

**సంస్థలకు ముందస్తు సన్నద్ధత**

దేశవ్యాప్తంగా సమయానికి ఒకే ప్రమాణాన్ని ఏర్పాటు చేయడమే కొత్త నిబంధనల ప్రధాన ఉద్దేశం. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, టెలికాం, రవాణా, ప్రభుత్వ సేవలు, ఆర్థిక మార్కెట్లలో సమయ వ్యత్యాసాల వల్ల తలెత్తే సమస్యలను తగ్గించేందుకు ఇది దోహదపడనుంది. నిబంధనలు అమల్లోకి రావడానికి 180 రోజుల గడువు ఉండటంతో సంస్థలు తమ డిజిటల్, సాంకేతిక వ్యవస్థలను ఐఎస్‌టీకి అనుగుణంగా మార్చుకోవాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత చట్టం ప్రకారం జరిమానాలు విధించే అవకాశం ఉంది.




# మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం

**తాష్కెంట్, ఆగస్టు 30:**

ఉజ్బెకిస్థాన్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీకి ఆ దేశ అత్యున్నత రాష్ట్ర పురస్కారం లభించింది. అధ్యక్షుడు శావ్కత్ మిర్జియోయెవ్ 'ఓలియ్ డారాజలి డోస్ట్ లిక్' పతకాన్ని మోదీకి ప్రదానం చేశారు. ప్రధానికి దక్కిన 36వ అంతర్జాతీయ పురస్కారం ఇదేనని సమాచారం.

**భారత్–ఉజ్బెకిస్థాన్ బంధానికి అంకితం**

పురస్కారం స్వీకరించడం గర్వంగా ఉందని మోదీ తెలిపారు. ఈ గౌరవాన్ని భారత్, ఉజ్బెకిస్థాన్ మధ్య శాశ్వత స్నేహ బంధానికి అంకితం చేస్తున్నట్లు చెప్పారు. భారతీయులకు సుపరిచితమైన 'దోస్త్' పదం మాదిరిగానే 'డోస్ట్ లిక్' అంటే స్నేహం అని వివరించారు.

**పలు దేశాల అత్యున్నత పురస్కారాలు**

ఈ ఏడాది జూలైలో ఇండోనేషియా అత్యున్నత పౌర పురస్కారం 'బింటాంగ్ ఆదిపూర్ణ'ను మోదీ అందుకున్నారు. జూన్‌లో సీషెల్స్ నుంచి పర్యావరణం, స్థిరమైన అభివృద్ధికి కృషికి 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజన్' అవార్డు, స్లొవేకియా అత్యున్నత రాష్ట్ర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్' లభించాయి.


**ఘనా, నార్వే, స్వీడన్, ఇజ్రాయెల్ గౌరవాలు**

ఇవే కాకుండా ఈ ఏడాది ఘనా, నార్వే, స్వీడన్, ఇజ్రాయెల్ దేశాలు కూడా మోదీకి తమ అత్యున్నత పౌర, రాష్ట్ర పురస్కారాలను అందించాయి. తనకు లభిస్తున్న ఈ గౌరవాలు వ్యక్తిగతమైనవి కావని, 140 కోట్ల మంది భారతీయులకు దక్కుతున్న గౌరవంగా భావిస్తున్నానని ప్రధాని పేర్కొన్నారు.



# ఎఫ్‌డీఏకు బాంబే హైకోర్టు షాక్

- **సిప్లా లైసెన్స్ రద్దుపై తీవ్ర అభ్యంతరం**
- **ఎంసీఏ రెస్టారెంట్ల మూసివేతపైనా ప్రశ్నలు**
- **చట్టాన్ని సరిగ్గా విశ్లేషించలేదని ఆగ్రహం**
- **అధికారుల తీరు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని వ్యాఖ్య**
- **కోర్టు హెచ్చరికలతో వెనక్కి తగ్గిన ఎఫ్‌డీఏ**




**ముంబై, ఆగస్టు 30:**

మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ)కు బాంబే హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సిప్లా ఫార్మా సంస్థకు చెందిన పుణె యూనిట్ డ్రగ్ సేల్ లైసెన్స్ రద్దు, ముంబై క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) ప్రాంగణంలోని ఐదు రెస్టారెంట్ల లైసెన్స్‌ల సస్పెన్షన్‌పై కోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చట్టాన్ని పూర్తిగా పరిశీలించకుండా తొందరపాటుతో నిర్ణయాలు తీసుకోవడం సరికాదని స్పష్టం చేసింది.

**సిప్లా లైసెన్స్ రద్దుపై ఆగ్రహం**

సిప్లా యూనిట్ లైసెన్స్ రద్దుకు ముందు అనుసరించాల్సిన విధానాన్ని ఎఫ్‌డీఏ పాటించలేదని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ సెలవు రోజున కంపెనీ ప్రతినిధిని విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ ఈమెయిల్ పంపడంపైనా అభ్యంతరం తెలిపింది. ఎఫ్‌డీఏ వ్యవహరించిన తీరు 'హైహ్యాండెడ్'గా ఉందని, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా లైసెన్స్ రద్దు ఉత్తర్వులు జారీ చేశారని వ్యాఖ్యానించింది. కోర్టు అభ్యంతరాల నేపథ్యంలో సిప్లా యూనిట్ లైసెన్స్ రద్దు ఉత్తర్వును ఎఫ్‌డీఏ వెనక్కి తీసుకుంది.

**ఎంసీఏ రెస్టారెంట్లపై చర్యకు ప్రశ్నలు**

బాంద్రాకుర్లా కాంప్లెక్స్‌లోని ఎంసీఏ ప్రాంగణంలో ఉన్న ఐదు రెస్టారెంట్ల కార్యకలాపాలను ఎఫ్‌డీఏ నిలిపివేసింది. అయితే తాజా తనిఖీల్లో ఆయా రెస్టారెంట్లు 88 శాతం మేర ఆహార భద్రతా నిబంధనలను పాటిస్తున్నట్లు తేలిందని కోర్టు దృష్టికి వచ్చింది. అయినప్పటికీ లైసెన్స్‌లు సస్పెండ్ చేయడంపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది.

**ఒప్పందంపై స్పష్టత ఇవ్వాలని ఆదేశం**

రెస్టారెంట్ల లైసెన్స్‌లు ఎంసీఏ పేరుతో ఉండగా.. వాటిని ఎంసీఏతో ఒప్పందం చేసుకున్న శిర్కే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్వహిస్తోంది. ఇదే కారణంతో ఎఫ్‌డీఏ లైసెన్స్‌లను సస్పెండ్ చేసింది. అయితే ఒక సంస్థ పేరుతో లైసెన్స్ ఉండి, మరో సంస్థ అదే ప్రాంగణంలో కార్యకలాపాలు నిర్వహించడాన్ని నిషేధించే నిబంధన చట్టంలో లేదని కోర్టు అభిప్రాయపడింది.

**'చట్టాన్ని అర్థం చేసుకుని వ్యవహరించండి'**

చట్టాన్ని అక్షరాలా పట్టుకుని ఆచరణాత్మక దృక్పథాన్ని పక్కన పెట్టొద్దని గత విచారణలోనే ఎఫ్‌డీఏ అధికారులకు కోర్టు సూచించింది. అయినప్పటికీ అధికారులు తమ ఆదేశాలను పట్టించుకోలేదని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదే వైఖరి కొనసాగితే ధిక్కరణ చర్యలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించింది. అవసరమైతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తూ, 'మీరు లార్డ్ అనుకుంటున్నారా? ఏదైనా చేయొచ్చని భావిస్తున్నారా?' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

**రెస్టారెంట్లకు కార్యకలాపాలకు అనుమతి**

కోర్టు హెచ్చరికల నేపథ్యంలో ఎంసీఏకు కొత్త నోటీసు జారీ చేసి, ఎంసీఏ-శిర్కే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మధ్య ఒప్పందంపై వారి వాదనను వినేందుకు ఎఫ్‌డీఏ అంగీకరించింది. అనంతరం కారణాలతో కూడిన తాజా ఉత్తర్వు జారీ చేస్తామని తెలిపింది. ప్రస్తుతం రెస్టారెంట్లు ఆహార భద్రతా నిబంధనలను పాటిస్తున్నందున వాటి లైసెన్స్ సస్పెన్షన్ ఉత్తర్వు రద్దయినట్లేనని కోర్టు స్పష్టం చేసింది. దీంతో రెస్టారెంట్లు తిరిగి కార్యకలాపాలు ప్రారంభించుకోవచ్చని తెలిపింది. సిప్లా కేసులో ప్యాకేజింగ్, రియాక్టిన్ ఫ్లస్ మాత్రల రీకాల్‌కు సంబంధించిన ఫాలోఅప్ తనిఖీల్లో ఉల్లంఘనలు గుర్తించామని ఎఫ్‌డీఏ తెలిపింది. ఈ కారణంగా పుణెలోని వాడ్కి ప్రాంతంలోని సిప్లా క్యారీయింగ్ అండ్ ఫార్వార్డింగ్ కేంద్రానికి సంబంధించిన డ్రగ్ సేల్ లైసెన్స్‌లను ఆగస్టు 27 నుంచి రద్దు చేసింది. అయితే హైకోర్టు తీవ్ర అభ్యంతరాల నేపథ్యంలో ఆ చర్యను వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది.

# బిలావల్ భుట్టో పెళ్లి ప్రచారంపై క్లారిటీ

- **యూరప్ రాజకుటుంబ యువతితో వివాహమంటూ ప్రచారం**
- **వార్తలు తప్పుడు, నిరాధారమన్న పీపీపీ నేత**
- **లిక్టెన్‌స్టెయిన్‌కు జర్దారీ వెళ్లినట్లు సోషల్ మీడియాలో కథనాలు**

**కరాచీ, ఆగస్టు 30:**

పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ చైర్మన్, మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ త్వరలో యూరప్‌కు చెందిన రాజకుటుంబ సభ్యురాలిని వివాహం చేసుకోబోతున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని పీపీపీ నేత, కరాచీ మేయర్ ముర్తజా వహాబ్ ఖండించారు. బిలావల్ నిశ్చితార్థం, వివాహానికి సంబంధించిన వార్తలు తప్పుడు, నిరాధారమైనవని స్పష్టం చేశారు.

**రాజకుటుంబ యువతితో పెళ్లంటూ ప్రచారం**

38 ఏళ్ల బిలావల్.. పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ కుమారుడు. ఇటీవల ఆయన వివాహానికి సంబంధించిన పలు పోస్టులు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. జర్దారీ తన కుమారుడి వివాహ తేదీ ఖరారు చేసేందుకు లిక్టెన్‌స్టెయిన్ వెళ్లినట్లు కొన్ని పోస్టుల్లో పేర్కొన్నారు. అంతేకాకుండా బిలావల్ వివాహం చేసుకోబోతున్న యువతి 26 ఏళ్ల మాజీ ఆస్ట్రియన్ ఆర్చ్‌డచెస్ గ్లోరియా వాన్ హ్యాబ్స్‌బర్గ్ అంటూ ప్రచారం సాగింది.

**హ్యాబ్స్‌బర్గ్ వంశానికి చెందిన యువతి**

గ్లోరియా వాన్ హ్యాబ్స్‌బర్గ్ ఆస్ట్రియా ఆర్చ్‌డ్యూక్ కార్ల్, ఫ్రాన్సెస్కా వాన్ థైసెన్‌బోర్నెమిస్జా కుమార్తెగా ప్రచారంలో ఉంది. హ్యాబ్స్‌బర్గ్‌లోరైన్ రాజవంశానికి చెందిన ఆమె.. ఆస్ట్రియా చివరి చక్రవర్తి, హంగేరీ చివరి రాజు కార్ల్ 1కి మునిమనవరాలిగా పేర్కొంటున్నారు. అయితే బిలావల్‌తో ఆమె వివాహం జరగబోతోందన్న ప్రచారానికి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు.

**పీపీపీ నేత ఖండన**

ఈ ప్రచారంపై ముర్తజా వహాబ్ శనివారం అర్ధరాత్రి ఎక్స్ వేదికగా స్పందించారు. బిలావల్ నిశ్చితార్థం, వివాహానికి సంబంధించిన వార్తలు 'తప్పుడు, నిరాధారమైనవి' అని పేర్కొన్నారు. మరోవైపు పాకిస్థాన్‌కు చెందిన ఉర్దూ దినపత్రిక డైలీ ఔసాఫ్ కూడా బిలావల్ వివాహానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు కథనం ప్రచురించింది. అయితే ఆ కథనాన్ని అనంతరం తొలగించింది.

**జర్దారీ పర్యటనపై వివరాలు గోప్యం**

ఆగస్టు 27న పాకిస్థాన్ అధ్యక్ష భవన్ ఎక్స్‌లో ఆసిఫ్ అలీ జర్దారీ ప్రైవేట్ పర్యటన కోసం విదేశాలకు వెళ్లినట్లు వెల్లడించింది. అయితే పర్యటన ఉద్దేశాన్ని మాత్రం ప్రకటించలేదు. ఈ పర్యటనకు బిలావల్ వివాహ ప్రచారానికి సంబంధం ఉందని నిర్ధారించే ఆధారాలు లేవు. బిలావల్ లేదా ఆయన కుటుంబ సభ్యులు కూడా వివాహంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో ప్రస్తుతం వైరల్ అవుతున్న పెళ్లి వార్తలను నిరాధారమైనవిగానే పీపీపీ నేత కొట్టిపారేశారు.

# పాక్ గూఢచర్య నెట్‌వర్క్ గుట్టురట్టు

- **లూథియానాలో 22 ఏళ్ల దుకాణదారుడి అరెస్ట్**
- **చైనా సీసీ కెమెరాలతో పాక్‌కు ప్రత్యక్ష ప్రసారం**
- **సైనిక కార్యకలాపాల సమాచారాన్ని చేరవేసినట్లు అనుమానం**
- **ఆయుధ డిపోకు సమీపంలో దుకాణం అద్దెకు తీసుకున్న నిందితుడు**
- **రూ.3 లక్షలు చెల్లించినట్లు విచారణలో వెల్లడి**

**లూథియానా, ఆగస్టు 30:**

పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐకి సంబంధించిన గూఢచర్య నెట్‌వర్క్‌ను పంజాబ్ పోలీసులు ఛేదించారు. పాకిస్థాన్ తరఫున గూఢచర్యానికి పాల్పడుతున్నట్లు అనుమానిస్తున్న 22 ఏళ్ల రచ్పాల్ సింగ్‌ను లూథియానాలో అరెస్టు చేశారు. నగరానికి సంబంధించిన కీలక సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

**చైనా సీసీ కెమెరాలతో నిఘా**

లూథియానా-ఫిరోజ్‌పూర్ రోడ్డులో నిందితుడు షూ దుకాణాన్ని అద్దెకు తీసుకున్నాడు. దుకాణం బయట రోడ్డువైపు చూసేలా చైనాలో తయారైన రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాడు. వాటి ద్వారా పరిసరాల్లో జరుగుతున్న కార్యకలాపాలను పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లు ప్రత్యక్షంగా పరిశీలించేవారని పోలీసులు తెలిపారు.

**ఆయుధ డిపోకు సమీపంలో దుకాణం**

పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్ల ఆదేశాల మేరకే దుకాణాన్ని అద్దెకు తీసుకున్నట్లు విచారణలో నిందితుడు వెల్లడించినట్లు కౌంటర్ ఇంటెలిజెన్స్ ఏఐజీ సిమ్రత్ పాల్ సింగ్ ధిండ్సా తెలిపారు. ఆ దుకాణం బధోవాల్ ఆయుధ డిపోకు సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు గుర్తించారు. నెలకు రూ.40 వేల అద్దె చెల్లిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**రూ.3 లక్షలు చెల్లించినట్లు సమాచారం**

గూఢచర్య కార్యకలాపాలకు పాక్ హ్యాండ్లర్లు నిందితుడికి సుమారు రూ.3 లక్షలు చెల్లించినట్లు విచారణలో వెల్లడైంది. దుకాణం పెద్దగా వ్యాపారం లేకపోయినా అద్దె చెల్లించడం, కెమెరాల దిశను తరచూ మార్చడం పోలీసులకు అనుమానం కలిగించింది. లూథియానాలో భారీ దాడికి పాకిస్థాన్ ఏజెన్సీలు పన్నిన కుట్రలో భాగంగానే ఈ నిఘా సాగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.



**సంయుక్తంగా అరెస్ట్**

ఆగస్టు 27న అందిన సమాచారంతో లూథియానా కమిషనరేట్ పోలీసులు, కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. రచ్పాల్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా సైనిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా పాకిస్థాన్‌కు చేరవేస్తున్నట్లు అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. నెట్‌వర్క్‌లో మరెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

# బ్రాండెడ్ క్రేజు..
# యువతకు తగ్గని మోజు




> ఇప్పుడంతా బ్రాండెడ్. ఒంటిపైన దుస్తుల నుంచి ఇంట్లోని గ్యాడ్జెట్ల దాకా యువత బ్రాండ్ మంత్రం జపిస్తోంది. బ్రాండెడ్ వస్తువులు వాడితేనే గ్రాండ్‌గా ఉంటుందనే వాళ్ల సంఖ్య పెరిగిపోతోంది. బ్రాండెడ్ దుస్తులు, వస్తువుల నాణ్యత, నమ్మకం, మన్నిక అన్నది వాస్తవం. వాటి కన్నా మిన్నగా అవి తమ హోదాకు ఓ చిహ్నంలా భావిస్తోంది ఈతరం. ఫ్యాషన్‌గా, ట్రెండీగా.. కనిపించాలనుకోవడం కోసమూ ఈ బ్రాండ్‌ల వెంట పరుగులు తీస్తున్నారు. అందుకే తలపై పెట్టుకునే టోపీ నుంచి పాదరక్షల దాకా అదే మోజులో పడిపోతున్నారు. బ్రాండెడ్ అప్పరెల్, యాక్సెసరీలు, బ్యాగులు, డిజైనర్ దుస్తులు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు.. ఇవి ఎంత ఖరీదైనా కొనడానికి వెనకాడటం లేదు.

గతేడాది రూ.లక్ష పైన ధర ఉండే ఐఫోన్లు ఇరవై లక్షలు అమ్ముడయ్యాయంటే ఈ ధోరణి ఎంతలా పెరిగిపోతోందో అర్థమవుతోంది. ఇలాంటి బ్రాండ్ల అమ్మకాల విలువ ఏడాదికి రూ.ఆరు లక్షల అరవై ఆరు వేల కోట్లపైనే. ఒంట్లోకి యవ్వనం తొంగి చూసే దశలోనే అమ్మాయిలు, అబ్బాయిలు ఈ బ్రాండెడ్ మోజులో పడిపోతున్నాయంటున్నాయి అధ్యయనాలు. కాలేజీ ముగిసేసరికి ఈ ధోరణి పీక్‌కి చేరుతోంది. పట్టణాలు, నగరాల్లోని ఈ మోజు అత్యధికం. ఇలా యువత బ్రాండ్ అంబాసిడర్లుగా మారడం వెనక ప్రధానంగా స్నేహితుల ప్రభావమే ఉంటోంది. 'తమలాగే డిజైనర్ దుస్తులు ధరించాలనీ.. బ్రాండెడ్ గ్యాడ్జెట్లు వాడాలనీ పీర్ గ్రూప్స్ నుంచి విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. అలా చేయకపోతే తమని చులకనగా చూస్తారనే భయం వాళ్లలో మొదలవుతుంది. ఖరీదైన దుస్తులు, ఉపకరణాలు వాడితే స్టైల్ ఐకాన్లుగా గుర్తిస్తారనీ, ప్రత్యేకంగా చూస్తారనే మనస్తత్వం చాలామందిని బ్రాండ్ విధేయులుగా మార్చేస్తోంది' అంటూ ఈ ట్రెండ్ వెనక మర్మమేంటో వివరించే ప్రయత్నం చేస్తున్నారు ముంబయికి చెందిన సైకాలజిస్ట్ ఆయుష్ చావ్లా. దీనికితోడు సామాజిక మాధ్యమాలు, మీడియా ప్రభావం ఉండనే ఉంటుంది. డిస్కౌంట్లు, ఆఫర్ల పేరిట ఆకట్టుకునేలా ఆయా కంపెనీలు విపరీతంగా ప్రచారం చేయడం.. సెలెబ్రిటీలు సైతం మేం ఇవే వాడుతున్నామంటూ వాణిజ్య ప్రకటనల్లో కనిపించడం.. యువతని బ్రాండ్ల వెంట పరుగులు తీసేలా చేస్తున్నాయి.



### వ్యసనంలా మారొద్దు..

సౌకర్యం, నాణ్యత కోరుకుంటే ఓకేగానీ.. బ్రాండ్ మోజులో కొనుగోలు వ్యసనంలా మారితే.. ఎవరికైనా తలకు మించిన భారమే. బ్రాండెడ్ దుస్తులు, గ్యాడ్జెట్ల కోసం కొంతమంది యువత విపరీతంగా ఖర్చు పెట్టడం.. అవి సొంతం కాకపోతే మానసికంగా కుంగిపోవడం.. లాంటివీ చేస్తున్నారు. తమిళనాడులో ఓ యువకుడు ఐఫోన్ కొనడానికి కిడ్నీని అమ్ముకోవడానికి సిద్ధపడ్డ వైపరీత్యం చూశాం. యువత ఒక్కసారి బ్రాండ్‌లకు అతి విధేయులుగా మారితే.. బయట పడటం కష్టం. ఎమోషనల్‌గా కనెక్ట్ అయితే.. ఇష్టపడే బ్రాండ్‌కి సంబంధించి ఏ ఉత్పత్తి బయటికొచ్చినా అవసరం లేకపోయినా కొనేస్తుంటారు. తమ తాహతుకు మించినదైనా.. అప్పు చేసైనా కొనేస్తుంటారు. అంతకుమించి నాణ్యమైనవి అందుబాటులో ఉన్నా పట్టించుకోరు. తాము ఆ ఊబిలో పడిపోవడమే కాదు.. ఇతరులూ ఆ గ్యాడ్జెట్, డ్రెస్, వస్తువు కొనేలా పదేపదే పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ ఇస్తుంటారు.

### కేర్‌ఫుల్‌గా ఉండాలి..

ఒక బ్రాండ్‌కి వీరవిధేయుడిగా మారడం వెనక తారల ప్రచారం, స్నేహితుల ఆర్భాటం, ఇతర వాణిజ్య ప్రకటనలు.. ఇలాంటివి ప్రభావం చూపిస్తుంటాయి. కొనుగోలు వ్యసనం, బ్రాండెడ్ ఊబి నుంచి బయట పడాలంటే వీటిని పట్టించుకోవద్దు. అసలు మన అవసరాలేంటి? ప్రాధాన్యాలేంటి? అని మనకు మనమే ఆలోచించుకోవాలి. ఒక కాలేజీ కుర్రాడికి లక్ష రూపాయల ఫోన్ అవసరమా? చిరుద్యోగి వేల ఖరీదు చేసే దుస్తులు తొడగొచ్చా? ఇలా ఎవరికి వారే ప్రశ్నించుకుంటే.. బ్రాండ్ లాయల్టీ నుంచి బయట పడొచ్చు. ఒక బ్రాండ్‌కి విధేయత చూపిస్తే ఫర్వాలేదు. కానీ ఫ్యాషన్, టెక్నాలజీ, ఎఫ్‌ఎంసీజీ... లాంటి రంగాల్లో మార్పులు వేగంగా వస్తుంటాయి. అదే నాణ్యత, సౌకర్యంతో తక్కువ ధరలో ఉత్పత్తులు దొరుకుతుంటే.. పాత బ్రాండ్‌కే అంటిపెట్టుకొని ఉండాల్సిన అవసరం ఏంటని ఆలోచించాలి.

# మొక్కలకు నెయ్యి వాడుతారని తెలుసా..





మామూలుగా శరీరానికి తగు మోతాదులో నెయ్యి అవసరం. శరీరానికి కావాల్సిన మంచి కొలస్ట్రాల్ నెయ్యి అని కూడా నిపుణులు చెబుతున్న సంగతి తెలిసిందే. ఇది జ్ఞాపకశక్తిని, జీర్ణశక్తిని పెంచడమే గాక రోగనిరోధక శక్తిని మెరుగ్గా ఉంచుతుంది. అలాంటి నెయ్యి మొక్కల సంరక్షణ కోసం వినియోగిస్తారని విన్నారా?. ఈ నెయ్యి వల్ల మొక్కల కుండీల్లో నేల సారవంతమై మొక్క ఆరోగ్యంగా పెరిగేలా చేయడమే కాకుండా పురుగు, పుట్ర వంటివి దరిచేరనివ్వదని చెబుతున్నారు అగ్రికల్చర్ పరిశోధకులు. ఇంతకీ మొక్కలకు నెయ్యి వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకుందాం.

- నెయ్యిలో కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉన్నందున, దానిని పెరుగుతున్న నేలలో వేయడం వల్ల సేంద్రీయ కూర్పు పెరుగుతుంది . దీన్ని మొక్క పెరుగుతున్న భాగంలో వేసి ఆ తర్వాత నీళ్లు పోసి వృద్ధి చెందేలా చూడాలి.
- అఫిడ్స్ స్లగ్‌లు కాండం, ఆకులపై దాడి చేయకుండా ఈ నెయ్యి రక్షిస్తుంది. దాని కుండే మృదు స్వభావానికి అవి దాడి చేయడం కష్టమవుతుంది. అలాగే ఇబ్బందికరమైన తెగుళ్ల నుంచి రక్షించుకోవడానికి నెయ్యి గొప్ప ప్రత్యామ్నాయం.
- దూదిపై 34 చుక్కల కరిగించిన నెయ్యి వేసి, తెగులు సోకిన మొక్క కాండం,ఆకులను తుడిస్తే..అఫిడ్స్, స్లగ్స్ పైకి రావు. నెయ్యిలోని కొవ్వులు నేలకు ఉపయోగపడే సూక్ష్మజీవులకు ఆహార వనరును అందిస్తాయి. మొక్క పెరుగుతున్న నేలలో సేంద్రీయ పదార్థం సమృద్ధిగా ఉండేలా చేస్తుంది. దీంతో మొక్క బాగా పెరగడమే గాక పచ్చగా పెరగడానికి సహాయపడుతుంది.
- ఇలా ప్రతి రెండు నుంచి మూడు నెలలకు చొప్పున రెండు నుంచి మూడు టీస్పూన్‌ల నెయ్యిని వేస్తే చాలు మంచి ఫలితాలు ఉంటాయి.
- రబ్బరు మొక్క వంటి పెద్ద ఆకులు కలిగిన మొక్కలకు నెయ్యితో మంచి ప్రయోజనం ఉంటుంది. తడిగా ఉన్న కాటన్ వస్త్రాన్ని ఉపయోగించి వాటి ఆకులను శుభ్రం చేయండి. పూర్తయిన తర్వాత, ఒక దూదిలో 4 నుంచి 5 చుక్కల కరిగించిన నెయ్యి వేసి, ఆకులను తుడవండి. ఇది ఆకులను మెరిసేలా చేయడమే కాకుండా కొవ్వు పొరను కూడా జోడిస్తుంది.

# అలారం ఆపేస్తున్నారా..?

పొద్దున్నే లేవాలని అలారం పెట్టుకుంటాం. అది సమయానికి మోగినా లేవాలని అనిపించదు. కళ్లు మూతలు పడుతుంటాయి. అలారం కట్టేసి తిరిగి పడుకుంటాం. మళ్లీ కాసేపటికి అలారం మోగుతుంది. తిరిగి కట్టేస్తాం, పడుకుంటాం. అలా నిద్ర, మెలకువతో తంటాలు పడుతూ.. పావుగంటకో, అరగంటకో తప్పనిసరి పరిస్థితుల్లో చివరికి మంచం మీద నుంచి దిగుతాం. తరచూ చాలామంది ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటూనే ఉంటారు. నిజానికి పెందలాడే నిద్ర లేవటం మంచి అలవాటే అయినా అందరికీ, అన్నిసార్లూ కుదరకపోవచ్చు. ముఖ్యంగా రాత్రిపూట ఆలస్యంగా నిద్రించేవారికిది పెద్ద సమస్యే. ఒకవేళ గత్యంతరం లేక లేచినా కొంత సేపటి వరకూ నిద్రమత్తుతో సతమతమవుతూనే ఉంటారు. పొద్దున్నే లేవనందుకు తమను తాము నిందించుకుంటుంటారు కూడా. ఇకపై అలా చింతించాల్సిన పనిలేదని స్వీడన్ తాజా అధ్యయనం చెబుతోంది. ఉదయం పూట మెలకువ వచ్చాక వెంటనే కాకుండా కునుకు తీసినట్టు కాసేపు పడుకొని లేవటం మంచిదేనని.. ఇది చురుకుగా, స్పష్టంగా ఆలోచించటానికి తోడ్పడుతుందని పేర్కొంటోంది. ముఖ్యంగా రాత్రిపూట ఆలస్యంగా పడుకునేవారికిది బాగా ఉపయోగపడుతుందని పరిశోధకులు వివరిస్తున్నారు. సాధారణంగా ఉదయం అలారాన్ని కట్టేసే అలవాటు చిన్నవయసువారిలో, ఆలస్యంగా నిద్రించేవారిలో ఎక్కువ. వీరిలో చాలామంది లేచాక కనీసం గంట సేపైనా నిద్రమత్తుతో జోగుతుంటారు. కాసేపు అలాగే పడుకొని, లేస్తే హుషారుగా ఉంటున్నట్టు పరిశోధకులు గుర్తించారు. అలారం మళ్లీ మళ్లీ మళ్లీ మోగటం వల్ల నిద్ర నాణ్యత తగ్గినప్పటికీ కార్టిజోల్ హార్మోన్ మోతాదులు, మూడ్ మీద పెద్దగా ప్రభావం చూపకపోవటం గమనార్హం. పైగా ఆలోచన సామర్థ్యమూ పెరుగుతున్నట్టు బయటపడింది.

అలాగని అలారాన్ని మాటిమాటికి ఆపేస్తూ ఎక్కువసేపు పడుకుంటామని అనుకుంటున్నారేమో. ఇదీ ప్రమాదమే. ఏదో అరగంట సేపైతే ఏమో గానీ ఎక్కువసేపు అలాగే మంచం మీద దొర్లితే మాత్రం ప్రమాదమే. దీంతో లాభాల కన్నా నష్టాలే ఎక్కువని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే మాటిమాటికీ అలారం కట్టేస్తూ ఎక్కువసేపు అలాగే పడుకుంటే నిద్రకు భంగం కలిగినట్టుగానే శరీరం భావిస్తుంది. ఇది రకరకాల అనర్థాలకు దారితీస్తుందని పరిశోధకులు చెబుతున్నారు.






# ఈ ఏడాది ఇండియన్ బ్యాంక్ 100 కొత్త బ్రాంచ్‌ల ఏర్పాటు

ప్రభుత్వ రంగ ఇండియన్ బ్యాంక్ తన వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశంలోని ఇతర ప్రాంతాలపై దృష్టి సారిస్తూ 100 కొత్త బ్రాంచులను ప్రారంభించడంతో పాటు, స్పెషలిస్ట్ ఆఫీసర్లు సహా 2,500 మంది కొత్త సిబ్బందిని నియమించుకోనున్నట్లు ఎండీ, సీఈఓ బినోద్ కుమార్ వెల్లడించారు. ఈ ఏడాది జూన్ 30 నాటికి దేశీయంగా 6,003 బ్రాంచ్‌లు, 41,875 మంది ఉద్యోగులు ఉన్న ఈ బ్యాంక్, తన గోల్డ్ లోన్స్ పోర్ట్‌ఫోలియోను 20 శాతం వృద్ధి రేటుతో రూ. 1.25 లక్షల కోట్ల నుంచి రూ. 1.5 లక్షల కోట్లకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే, స్థూల మొండి బకాయిలను 1.51.6 శాతానికి తగ్గించడమే కాకుండా, రూ. 200 కోట్ల బ్యాడ్ లోన్స్‌ను అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీకి విక్రయించి నికర నిరర్థక ఆస్తులను అదుపులోకి తీసుకొస్తామని బ్యాంకు పేర్కొంది. ప్రస్తుతం మొత్తం రుణాల్లో రిటైల్, వ్యవసాయం, ఎంఎస్‌ఎంఈలు కలిపి 65 శాతం వాటా కలిగి ఉండగా, కార్పొరేట్ రుణాలు 35 శాతంగా ఉన్నాయని వెల్లడించింది.



# బిట్‌కాయిన్‌పై సంచలన అంచనా.. త్వరలోనే $1 మిలియన్!

క్రిప్టో కరెన్సీ మార్కెట్‌లో బిట్‌కాయిన్ భవిష్యత్తుపై బినాన్స్ వ్యవస్థాపకుడు చాంగ్‌పెంగ్ జావో (CZ) మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక్కో బిట్‌కాయిన్ విలువ భవిష్యత్తులో 1 మిలియన్ డాలర్లకు (ప్రస్తుత మారక విలువ ప్రకారం సుమారు రూ.9.5 కోట్లు) చేరడం ఖాయమని, ఇందుకు 25 ఏళ్లు పట్టకపోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల హాంకాంగ్‌లో జరిగిన బిట్‌కాయిన్ ఆసియా 2026 సదస్సులో 'బిట్‌కాయిన్ శతాబ్ధి' పేరుతో జరిగిన చర్చలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

అయితే బిట్‌కాయిన్‌ను కేవలం ధర ఆధారంగా అంచనా వేయడం సరికాదని చాంగ్‌పెంగ్ జావో స్పష్టం చేశారు. రాబోయే దశాబ్దంలో దాని వినియోగం, చెల్లింపుల్లో వినియోగం, సంస్థాగత స్వీకరణ భారీగా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. పెద్ద ఎత్తున బిట్‌కాయిన్ చెల్లింపులు జరగడం, రిటైర్మెంట్ ఫండ్లు, పెన్షన్ ఫండ్లు, పెట్టుబడి నిధులు, ప్రభుత్వాల రిజర్వ్ ఆస్తుల్లో బిట్‌కాయిన్‌కు స్థానం లభించడం వంటి పరిణామాలు కీలక మైలురాళ్లుగా మారతాయని పేర్కొన్నారు.

**బంగారాన్ని మించుతుందా?**

భవిష్యత్తులో బిట్‌కాయిన్ ప్రాధాన్యత బంగారాన్ని మించే అవకాశం ఉందని చాంగ్‌పెంగ్ జావో అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా తదుపరి బుల్ మార్కెట్‌లో బిట్‌కాయిన్ మార్కెట్ విలువ పరంగా బంగారాన్ని అధిగమించవచ్చని ఆయన పేర్కొన్నట్లు ది బ్లాక్ నివేదించింది. అయితే ప్రస్తుతం ఈ రెండింటి మధ్య భారీ వ్యత్యాసం ఉంది. ఇటీవలి మార్కెట్ డేటా ప్రకారం బిట్‌కాయిన్ ధర ఆగస్టు చివర్లో సుమారు 80,000 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఆగస్టు 25న ఇది 80,600 డాలర్ల ప్రాంతాన్ని తాకింది. దీంతో 1 మిలియన్ డాలర్ల లక్ష్యాన్ని చేరాలంటే ప్రస్తుత స్థాయి నుంచి బిట్‌కాయిన్ దాదాపు 12 రెట్లు పెరగాల్సి ఉంటుంది.

**AI, స్టేబుల్‌కాయిన్లదే తదుపరి దశ**


క్రిప్టో రంగంలో వచ్చే పదేళ్లలో కేవలం బిట్‌కాయిన్ మాత్రమే కాకుండా స్టేబుల్‌కాయిన్లు, టోకెనైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), AI ఏజెంట్లు కీలక పాత్ర పోషిస్తాయని సీజెడ్ అంచనా వేశారు. టోకెనైజ్డ్ ఆస్తులు, డిజిటల్ చెల్లింపులు వేగంగా విస్తరించడంతో సంప్రదాయ ఆర్థిక వ్యవస్థతో క్రిప్టో రంగం అనుసంధానం మరింత బలపడుతుందని ఆయన అన్నారు. బిట్‌కాయిన్ ప్రధానంగా దీర్ఘకాలిక పొదుపు, రిజర్వ్ ఆస్తిగా ఎదగవచ్చని, మరోవైపు స్టేబుల్‌కాయిన్లు రోజువారీ చెల్లింపులు, ట్రేడింగ్, అలాగే AI ఏజెంట్ల మధ్య జరిగే మెషిన్‌టుమెషిన్ లావాదేవీల్లో కీలకంగా మారవచ్చని ఆయన వివరించారు.

# ప్రపంచం కోసం భారత్‌లో తయారీ ప్లాంట్లను నెలకొల్పండి

భారత్‌లో తయారీ, సాంకేతిక, ఆవిష్కరణ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిందిగా ప్రపంచ పెట్టుబడిదార్లను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆహ్వానించారు. భారత్‌లోని ప్రతిభను, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కెనడాలో మూడు రోజుల పర్యటన ముగించుకొని ఆరు రోజుల పర్యటన నిమిత్తం ఆమె అమెరికాకు చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా చికాగోలో ప్రముఖ పెట్టుబడిదార్లు, వ్యాపార సంస్థల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఇందులో భారత్ సాధిస్తున్న వేగవంత వృద్ధి, సంస్కరణలు, దీర్ఘకాలిక పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రముఖంగా వారితో ఆమె ప్రస్తావించారు. 'వ్యాపార సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి, తయారీ, ఆవిష్కరణ, విస్తరణకు వీలు కల్పించే వాతావరణాన్ని సృష్టించేలా విధానాలు తీసుకొని రావడంపై భారత్ ఎక్కువగా దృష్టి సారిస్తోంద'ని యూఎస్ ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ సహకారంతో చికాగోలోని భారత కాన్సులేట్ జనరల్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె అన్నారు. భారత్‌ను కేవలం సేవలు అందించే మార్కెట్‌గానే కాకుండా.. ప్రపంచం కోసం నిర్మించడానికి ఒక వేదికగా చూడాలని ఆమె వారికి తెలిపారు. భారతదేశ ఇంజినీరింగ్ ప్రతిభ, తయారీ స్థాయి, సాంకేతికత వ్యవస్థను సద్వినియోగం చేసుకుంటూ దానిని ఒక తయారీ కేంద్రంగా, సాంకేతిక, ఆవిష్కరణల కేంద్రంగా, వినియోగదార్ల విపణిగా, దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల పెట్టుబడులకు గమ్యస్థానంగా చూడాలని సూచించారు.

# మేక్ ఇన్ ఇండియాకు బీఐఎస్ అడ్డంకి!

మనదేశంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అమలు చేస్తున్న తప్పనిసరి నాణ్యతా ధృవీకరణ విధానం (క్యూసీఓ) విదేశీ పెట్టుబడిదారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. టోక్యో పర్యటనలో భాగంగా హైటెక్నాలజీ పరిశ్రమలకు ఈ నాణ్యతా నిబంధనల నుండి మినహాయింపు ఇస్తామని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించినప్పటికీ, కేవలం ఒక రంగానికే ఉపశమనం ఇవ్వడం వల్ల పూర్తి సమస్య పరిష్కారం కాదని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) తన తాజా నివేదికలో వెల్లడించింది. దేశంలో తయారీ రంగాన్ని పెంచాలనే లక్ష్యానికి ఈ క్లిష్టమైన సర్టిఫికేషన్ నిబంధనలు పెద్ద ప్రతిబంధకంగా మారుతున్నాయని జీటీఆర్ఐ వ్యవస్థాపకులు అజయ్ శ్రీవాస్తవ స్పష్టం చేశారు.



**జపనీస్ కంపెనీలపై ప్రభావం**

జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జేఈటీఆర్ఓ) జరిపిన సర్వే ప్రకారం, భారత్‌లో పనిచేస్తున్న 71.9 శాతం జపనీస్ కంపెనీలు బీఐఎస్ సర్టిఫికేషన్ వల్ల తమ వ్యాపారం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశాయి. ముఖ్యంగా సాధారణ యంత్రాల తయారీదారుల్లో 92.3 శాతం, రవాణా పరికరాల కంపెనీల్లో 76.8 శాతం సంస్థలు ఈ నిబంధనల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇతర దేశాల్లో ఇప్పటికే నాణ్యతా పరీక్షలు పూర్తి చేసుకున్న ఉత్పత్తులకు కూడా భారత్‌లో మళ్లీ సుదీర్ఘమైన తనిఖీలు, డాక్యుమెంటేషన్, అధికారుల విదేశీ ఫ్యాక్టరీ పర్యటనలు నిర్వహించడం వల్ల సమయం, డబ్బు వృథా కావడమే కాక 42.7 శాతం వ్యాపారాల అమ్మకాలు నిలిచిపోయాయని నివేదిక తెలిపింది.

**సంక్లిష్టమైన లైసెన్సింగ్ విధానం**

ప్రస్తుత బీఐఎస్ ధృవీకరణ వ్యవస్థ నాణ్యతను పెంచడం కంటే ఖరీదైన 'లైసెన్సింగ్ రాజ్'లా మారిందని జీటీఆర్ఐ అభిప్రాయపడింది. ఒక వియత్నామీస్ స్క్రూ తయారీ కంపెనీ ల్యాబ్ పరీక్షల కోసం రూ. 20 లక్షలు, కన్సల్టెన్సీ, తనిఖీల కోసం మరో రూ. 40 లక్షలు చొప్పున మొత్తం రూ. 60 లక్షలు ఖర్చు చేసినప్పటికీ చివరికి తుది బీఐఎస్ నిర్ణయం మాత్రం అందలేదు. అంతేకాకుండా ఉక్కు వంటి ముడిసరుకులకు, తుది ఉత్పత్తులకు వేర్వేరుగా ఇచ్చే 'డబుల్ సర్టిఫికేషన్', క్యూసీఓ పరిధిలోకి రాని ఉత్పత్తులకు కూడా మినహాయింపు జాబితాల పేరుతో అదనపు పత్రాలు కోరడం వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) తీవ్రంగా నష్టపోతున్నాయి.

ఈ సమస్యల పరిష్కారానికి యూరోపియన్ యూనియన్ అనుసరిస్తున్న 'ప్రమాదఆధారిత' నియంత్రణ వ్యవస్థను భారత్ కూడా స్వీకరించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ విధానంలో తయారీదారులే స్వయంగా తమ ఉత్పత్తుల నాణ్యతకు హామీ ఇస్తూ 'సీఈ మార్క్' ఉపయోగించుకోవచ్చు. ప్రభుత్వం ముందస్తు పర్మిషన్లు, తనిఖీల పేరుతో వేధించకుండా, కేవలం ప్రజారోగ్యం, భద్రతకు ముప్పు కలిగించే కీలక ఉత్పత్తులకే బీఐఎస్ ముందస్తు రిజిస్ట్రేషన్ పరిమితం చేయాలి. తక్కువ రిస్క్ ఉన్న ఉత్పత్తులకు మార్కెట్ పర్యవేక్షణ, ఉల్లంఘనలు జరిగితే జరిమానాలు విధించే పద్ధతిని అమలు చేయాలి.

**ఎగుమతులకు ఎదురయ్యే సవాళ్లు**

ఫర్నిచర్, పాదరక్షలు వంటి నిత్యావసర వస్తువులకు కూడా తప్పనిసరి సర్టిఫికేషన్ విధించడం వల్ల వస్తువుల ధరలు పెరిగి వినియోగదారులపై భారం పడుతుందని, వీటిని నాణ్యత ఆధారిత మార్కెట్ పోటీకే వదిలేయాలని నివేదిక స్పష్టం చేసింది. భారత్ అనుసరిస్తున్న ఈ విధానాన్ని చూసి ఇతర దేశాలు కూడా రేపు భారతీయ ఎగుమతులపై ఇలాంటి కఠిన నిబంధనలే విధిస్తే, మన కంపెనీలు భారీగా అదనపు తనిఖీ ఖర్చులు భరించాల్సి వస్తుంది. అందువల్ల 'మేక్ ఇన్ ఇండియా' విజయం సాధించాలన్నా, విదేశీ పెట్టుబడులు రావాలన్నా ప్రభుత్వం ఈ క్యూసిఓ (క్యూసీఓ) ఫ్రేమ్‌వర్క్‌పై తక్షణమే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి సమగ్ర సంస్కరణలు చేపట్టడం అత్యవసరం.

# అర్హులైన ఉద్యోగులకు సువర్ణావకాశం!

- **ఎంప్లాయీస్ ఎన్‌రోల్‌మెంట్ క్యాంపెయిన్ (EEC) 2026**
- **చివరి గడువు: అక్టోబర్ 31, 2026**
- **అర్హతా కాలం: 2009 ఏప్రిల్ 1 నుండి 2026 మార్చి 31 మధ్య పనిచేసి, పీఎఫ్ లేని ఉద్యోగులు**




**ఉద్యోగులకు ప్రయోజనం ఏంటి?**

ఈపీఎఫ్‌లో నమోదు కావడం ద్వారా అర్హత కలిగిన ఉద్యోగులకు భవిష్య నిధి మాత్రమే కాకుండా సంబంధిత పెన్షన్, ఉద్యోగి డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ (EDLI) వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు అందుబాటులోకి వస్తాయి. అదే సమయంలో సంస్థల గత కాంప్లయన్స్ లోపాలను క్రమబద్ధీకరించేందుకు కూడా ఈ ప్రత్యేక విండో ఉపయోగపడుతుంది.

ప్రైవేటు రంగ ఉద్యోగులకు ఉపయోగపడే కీలక నిర్ణయాన్ని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (EPFO) తీసుకుంది. ఇంతకాలం అర్హత ఉన్నప్పటికీ ఈపీఎఫ్ (EPF) పరిధిలోకి రాని ఉద్యోగులను నమోదు చేసేందుకు 'ఎంప్లాయీస్ ఎన్‌రోల్‌మెంట్ క్యాంపెయిన్ (EEC) 2026'ను ప్రారంభించింది. గతంలో మిగిలిపోయిన నమోదు, కాంప్లయన్స్ లోపాలను సరిదిద్దడంతోపాటు మరింత మంది ఉద్యోగులకు పీఎఫ్, పెన్షన్, బీమా వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

**అక్టోబర్ 31 వరకు అవకాశం**

కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ 2026 జూన్ 29న EEC2026ను నోటిఫై చేసింది. ఈ ప్రత్యేక ప్రచారం జూలై 1 నుంచి అమల్లోకి వచ్చింది. ఉద్యోగుల నమోదు కోసం అక్టోబర్ 31 వరకు అవకాశం ఉంది. వివిధ సంస్థల్లో 2009 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 మధ్య కాలంలో పనిచేసినా, అర్హత ఉన్నప్పటికీ గతంలో EPFలో నమోదు కాని ఉద్యోగులను ఈ పథకం కింద చేర్చవచ్చు. అయితే డిక్లరేషన్ సమయంలో సంబంధిత ఉద్యోగి అదే సంస్థలో ఉద్యోగంలో కొనసాగుతూ ఉండాలి.

**యజమానులకు ప్రత్యేక వెసులుబాటు**

గతంలో ఉద్యోగుల నుంచి పీఎఫ్ వాటా మినహాయించకపోయిన సందర్భాల్లో, EEC 2026 కింద ప్రకటించిన ఉద్యోగులకు ఉద్యోగి వాటా చెల్లింపు నుంచి మినహాయింపు కల్పించారు. అయితే యజమాని తన వాటాతోపాటు వర్తించే వడ్డీ, అడ్మినిస్ట్రేటివ్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా విధించే నష్ట పరిహారానికి బదులుగా ఈ ప్రచారం కింద ఒక్కో సంస్థకు రూ.100 లంప్‌సమ్ డ్యామేజెస్ నిబంధనను తీసుకొచ్చారు.

**ఎవరికి వర్తిస్తుంది?**

ఈ ప్రచారం ప్రధానంగా గతంలో ఈపీఎఫ్ కవరేజీకి దూరమైన అర్హత కలిగిన ఉద్యోగుల కోసం ఉద్దేశించినది. ఈపీఎఫ్ పరిధిలో ఉన్న లేదా ఈపీఎఫ్ చట్టం/సామాజిక భద్రతా కోడ్ కింద కవరేజీకి వచ్చే సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. యజమానులు తమ పాత ఉద్యోగ, వేతన రికార్డులను పరిశీలించి అర్హులైన ఉద్యోగులు ఎవరైనా నమోదు కాకుండా మిగిలిపోయారా అనేది గుర్తించాలని ఈపీఎఫ్‌వో సూచించింది.

**ఆన్‌లైన్‌లోనే నమోదు**

EEC2026 కింద నమోదు ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. ప్రకటించిన ఉద్యోగులకు ఉమాంగ్ (UMANG) యాప్ ద్వారా ఫేస్ ఆథెంటికేషన్ ఆధారంగా UAN జనరేషన్, అనంతరం ECR ద్వారా సంబంధిత పీఎఫ్ కాంట్రిబ్యూషన్ల చెల్లింపు వంటి విధానాలను ఈపీఎఫ్‌వో పేర్కొంది. దీంతో గతంలో నమోదు కాని ఉద్యోగులను అధికారిక సామాజిక భద్రతా వ్యవస్థలోకి తీసుకురావడంతోపాటు రికార్డుల్లో పారదర్శకత పెరగనుంది.

## విద్యుత్తు స్కూటర్ కావాలా..

ప్రజాదరణ ఎక్కువగా ఉండే కార్లకు వేచిచూసే సమయం ఉండడం మామూలే. అయితే ఇపుడా పరిస్థితి విద్యుత్ స్కూటర్లలోనూ కనిపిస్తోంది. వీటికి గిరాకీ పెరుగుతుండడంతో పాటు, అందుకు తగ్గట్లుగా ఉత్పత్తి లేకపోవడంతో షోరూముకు వెళ్లి కొత్త స్కూటర్‌ను వెంటనే తీసుకొచ్చే రోజులు పోయాయి. కనీసం 3 వారాల నుంచి గరిష్ఠంగా 23 నెలల వరకూ ఆగాల్సి వస్తోంది.

**అన్ని బ్రాండ్లకూ అదే సమస్య**

దాదాపు అన్ని ప్రముఖ బ్రాండ్లకూ వేచిచూసే సమయం పెరిగింది. ముఖ్యంగా కొనుగోలుదార్ల ఆసక్తి ఎక్కువగా ఉండే మోడళ్లు, వినియోగదార్లకు నచ్చిన రంగుల వేరియంట్‌లకు ఉన్న గిరాకీకి తగ్గట్లుగా వెయిటింగ్ కూడా పెరుగుతోంది. దీంతో కంపెనీలు తయారీ సామర్థ్యాలను పెంచుకునే పనిలో పడ్డాయి. అయితే అందుకు 12 ఏళ్ల వరకు సమయం పడుతుంది. 'కొద్ది నెలలుగా అన్ని విద్యుత్ ద్విచక్ర వాహన బ్రాండ్లకు వేచిచూసే సమయం పెరిగింది. అయితే నగరం, బ్రాండ్, వేరియంట్‌ను బట్టి ఇది కాస్త అటూఇటూగా ఉంటోంద'ని వాహన డీలర్ల సంఘాల సమాఖ్య(ఫాడా) ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ అంటున్నారు. వేర్వేరు ధరల వద్ద వేర్వేరు వేరియంట్లు లభిస్తుండడంతో వినియోగదార్లు ఎంచుకునేందుకు ఎక్కువ ఆప్షన్లు కనిపిస్తున్నాయి. అదీకాక పశ్చిమాసియాలో యుద్ధం పుణ్యమాని పెట్రోలు ధరలపై అనిశ్చితి ఏర్పడడంతో సంప్రదాయ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్(ఐసీఈ) వాహనాల నుంచి ఈవీలవైపు వినియోగదార్లు మళ్లుతున్నారు.

**ఉన్న వేరియంట్లే కొనేస్తున్నారు..**

చాలా వరకు డీలర్ల వద్ద నిల్వలు ఎక్కువగా ఉండడం లేదు. పరిమిత రంగుల వేరియంట్లే లభ్యమవుతున్నాయి. దీంతో ఎక్కువ కాలం వేచిచూసే ఓపికలేని వారు తమకు అందుబాటులో ఏది ఉందో అదే కొనేస్తున్నారు. గిరాకీ ఎంతలా పెరిగిందో ఈ క్యాలెండర్ సంవత్సరంలో విక్రయాలే చెబుతున్నాయి.

# చెన్నారంలో ఘనంగా మడేలయ్య జాతర

- **బోనాలతో పోటెత్తిన మహిళా భక్తులు**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :**

నేలకొండపల్లి,నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామంలో ఇలవేల్పు మడేలయ్య స్వామి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతరకు భక్తులు భారీగా తరలిరావడంతో గ్రామమంతా జాతర వాతావరణం నెలకొంది. డిజే, కోలాటాలతో హోరెత్తిన గ్రామం:ఉదయం నుండి మడేలయ్య ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. మంగళ వాయిద్యాలు, డిజే చప్పుళ్ల నడుమ, యువకులు కోలాటాలు వేస్తూ ఉత్సాహంగా ఊరేగింపు నిర్వహించారు. డప్పు చప్పుళ్లకు అనుగుణంగా చిన్నారులు, యువకులు చేసిన కోలాట నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

**మహిళల బోనాలతో అమ్మవారికి నీరాజనం:**

ఈ ఉత్సవాల్లో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. తలపై బోనాలు ఎత్తుకుని, సంప్రదాయ దుస్తుల్లో బోనమెత్తిన మహిళలు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని మడేలయ్య స్వామిని వేడుకున్నారు. మహిళలు బోనాలతో బారులు తీరడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.ఈ కార్యక్రమంలో చెన్నారం రజక సంఘం పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామ ప్రజలు



పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు

# ఐపీఎల్‌లో ఎన్నికల నగారా!




ఇండియన్ ప్రీమియర్ లీగ్ అనగానే టీ20 క్రికెట్ సందడి గుర్తుకొస్తుంది. స్టార్ ఆటగాళ్ల మెరుపులతో మార్మోగిపోయే ఐపీఎల్‌లో ఎన్నికల సందడి మొదలైంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి ఎలక్టోరల్ అధికారి ఏకే జోటీ శనివారం రెండు కీలక పదవులకు నోటిఫికేషన్ ఇచ్చారు. పాలక మండలిలోని ఈ పోస్టుల భర్తీకి సెప్టెంబర్ 18వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తాని ఆయన తెలిపారు. అయితే.. ప్రస్తుతం ఐపీఎల్ ఛైర్మన్‌గా కొనసాగుతున్న అరుణ్ సింగ్ ధుమాల్ మరోసారి రేసులో ఉండనున్నారు. దాంతో.. ఆయన మరోసారి ఎన్నికవ్వడం ఖాయమని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఐపీఎల్ పాలక మండలిలోని రెండు కీలక పదవులకు బీసీసీఐ ఎన్నికలు నిర్వహించనుంది. ఎలక్టోరల్ అఫీసర్ ఏకే జోటి శనివారం ప్రకటించారు. బీసీసీఐ రాజ్యాంగంలోని నిబంధన 28 ప్రకారం ఈ రెండు పోస్టులను భర్తీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. బీసీసీఐ వార్షిక సమావేశం జరుగనున్న సెప్టెంబర్ 18వ తేదీన ఎలక్షన్ ఉంటుందని జోటి పేర్కొన్నారు. 28వ నియమం ప్రకారం ఐపీఎల్ పాలకమండలిలో నలుగురు సభ్యులు ఉండాలి. వీరిలో ఇద్దరిని బీసీసీఐ వార్షిక సమావేశంలో ఎన్నుకుంటారు. గతంలో ఐపీఎల్ ఛైర్మన్‌గా ఎన్నికైన అరుణ్ సింగ్ ధుమాల్ (హిమాచల్ ప్రదేశ్ బోర్డు), ఐపీఎల్ పాలకవర్గంలో సభ్యుడైన ఖైరుల్ జమాల్ మజుందార్ (మిజోరాం బోర్డు) పదవీ కాలం ముగిసింది. షెడ్యూల్ ప్రకారం ఏడాదిలో ఎన్నికలు నిర్వహించాలి.

# పాకిస్థాన్ తరఫున ఆడే ప్రసక్తే లేదు



స్పోర్ట్స్ డెస్క్ : పాకిస్థాన్ జట్టు తరఫున ఆడే ప్రసక్తే లేదంటూ ఆ దేశ మాజీ క్రికెటర్, సీనియర్ పేసర్ మహమ్మద్ ఆమిర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఇటీవలే అతడికి బ్రిటీష్ పౌరసత్వం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అతడు తిరిగి పాకిస్థాన్ జట్టులోకి రీ ఎంట్రీ ఇస్తాడనే వార్తలు బయటకు వచ్చాయి. అయితే పునరాగమనంపై వస్తున్న ఊహాగానాలకు ఆమిర్ తెరదించాడు. ప్రఖ్యాత యూట్యూబ్ ఛానల్ 'పుర్కాన్ భట్టి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమిర్ ఈ కీలక విషయాలను వెల్లడించాడు. తన భార్య నర్గిస్ ఖాన్ ద్వారా ఆమిర్ బ్రిటీష్ పౌరసత్వాన్ని పొందాడు. ఈ క్రమంలోనే ఇంగ్లండ్‌లో జరిగే 'ది హండ్రెడ్' టోర్నీ, అలాగే కౌంటీ ఛాంపియన్‌షిప్‌లలో విదేశీ ఆటగాడిగా కాకుండా స్థానిక ఆటగాడిగా బరిలోకి దిగుతున్నాడు. అయితే ఇంగ్లండ్ దేశవాళీ టోర్నీలలో స్థానిక ఆటగాడిగా ఆడాలంటే.. అక్కడి నిబంధనల ప్రకారం వేరే దేశం తరఫున ప్రాతినిధ్యం వహించకూడదు. ఆ మేరకు ఓ పత్రంపై సంతకం చేయాల్సి ఉంటుంది. 'నేనిప్పుడు ఇంగ్లండ్ పౌరుడిని అయ్యాను. ఇక్కడి నిబంధనల కారణంగా పాకిస్థాన్‌తో నా అధ్యాయం ముగిసింది' అని ఆమిర్ తేల్చిచెప్పాడు. తన కెరీర్‌కు సంబంధించి భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడుతూ.. పాకిస్థాన్ సూపర్ లీగ్ తన ప్రాధాన్యతగా ఉంటుందని, 2027 పీఎస్ఎల్‌లో తాను విదేశీయ ఆటగాడిగా ఆడతానని తెలిపాడు. ఇక ఐపీఎల్ లో ఆడే అంశంపై స్పందిస్తూ.. తాను ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నాడు. గతంలో పాక్ మాజీ ఆల్ రౌండర్ అజహర్ మహమూద్ కూడా బ్రిటీష్ పౌరసత్వం పొంది ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల తరఫున ఆడాడు.




# వైభవ్ సూర్యవంశీకి కెప్టెన్ పగ్గాలు

## 15 ఏళ్లకే కెప్టెన్‌గా అరుదైన ఘనత

### దులీప్ ట్రోఫీలో చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ

### ఇషాన్ కు గాయం.. ఈస్ట్ జోన్ తాత్కాలిక కెప్టెన్‌గా వైభవ్

### కేవలం తొమ్మిది ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లు ఆడిన అనుభవంతో బాధ్యతలు


దులీప్ ట్రోఫీ సెమీ ఫైనల్స్ సందర్భంగా ఈస్ట్ జోన్ జట్టుకు ఊహించని రీతిలో ఓ అరుదైన సన్నివేశం ఎదురైంది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న కీలక మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ గాయపడటంతో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఈస్ట్ జోన్ జట్టుకు కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ఈస్ట్ జోన్ జట్టు కెప్టెన్ ఇషాన్ కిషన్ వికెట్ కీపింగ్ చేస్తుండగా గాయం కారణంగా మైదానం వీడవలసి వచ్చింది. ఆ సంఘటనతో 15 ఏళ్ల వయసులోనే వైభవ్ సూర్యవంశీ తొలిసారిగా ఓ సీనియర్ దేశీయ క్రికెట్ మ్యాచ్‌కు కెప్టెన్ అయ్యాడు. ఇషాన్ గాయం కారణంగా స్టేడియం విడిచివెళ్లడంతో తాత్కాలికంగా వైభవ్ సూర్యవంశీ కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించాడు. ఈస్ట్ జోన్ ఫీల్డింగ్ చేస్తుండగా.. ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో అభిజిత్ సర్కార్ బౌలింగ్ చేస్తున్నాడు. అతను వేసిన బంతుల్లో ఒకటి ఇషాన్ కిషన్ బొటనవేలికి తగిలింది. ఒక ఫిజియో మైదానంలోకి వచ్చాడు, కానీ అక్కడి పరిస్థితుల కారణంగా ఇషాన్ వెళ్ళిపోవాల్సి వచ్చింది. ఇషాన్ తన బొటనవేలికి ఐస్ పెట్టుకోవడానికి మైదానం విడిచి వెళ్ళినప్పుడు జార్ఖండ్‌కు చెందిన కుమార్ కుశాగ్ర వికెట్ కీపింగ్ బాధ్యతలు స్వీకరించాడు. ఇషాన్ జట్టుకు దూరమవ్వడంతో వైభవ్ సూర్యవంశి తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు, ఎందుకంటే వైభవ్ సూర్యవంశి అప్పటికే ఈస్ట్ జోన్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఇప్పుడు కేవలం తొమ్మిది ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల తర్వాత వైభవ్ సూర్యవంశి తన దేశీయ క్రికెట్ కెరీర్‌లో తొలిసారిగా ఒక సీనియర్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇదిలా ఉండగా.. ఈస్ట్ జోన్ విషయానికి వస్తే వారి జట్టులో 30 ఏళ్ల అభిమన్యు ఈశ్వరన్ ఉన్నాడు . అతను 114 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల అనుభవం కలిగి ఉన్నాడు. అతని అనుభవం ఉన్నప్పటికీ సెలెక్టర్లు వైభవ్‌ను వైస్‌కెప్టెన్‌గా నియమించారు. ఫలితంగా దులీప్ ట్రోఫీ సెమీఫైనల్‌లో వైభవ్ ఇప్పుడు ఈస్ట్ జోన్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. అయితే ఇషాన్ కిషన్ స్టేడియంలోకి అడుగుపెట్టిన వెంటనే వైభవ్ మళ్లీ వైస్‌కెప్టెన్ పాత్రలోకి మారతాడు.

# బుల్లితెరపై దాదా కొత్త ఇన్నింగ్స్

- బెంగాలీ బిగ్‌బాస్ హోస్ట్‌గా సౌరభ్ గంగూలీ
- ఒక్క సీజన్‌కు రూ.120 కోట్ల రెమ్యూనరేషన్ ఆఫర్ చేసినట్లు టాక్
- జియో హాట్‌స్టార్‌లో 24x7 లైవ్ స్ట్రీమింగ్

స్పోర్ట్స్ డెస్క్ :

టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ ఇప్పుడు బుల్లితెర ప్రేక్షకులను అలరించేందుకు రెడీ అవుతున్నాడు. అంటే మన మాజీ కెప్టెన్ ఆయన సిరీస్‌ల్లోనో, సీరియల్స్‌లోనో నటిస్తున్నాడనుకోకండి. గంగూలీ కనిపించేది వ్యాఖ్యాతగా. బెంగాలీ బిగ్‌బాస్ రియాలిటీ షోకు ఆయన హోస్ట్‌గా వ్యవహరించనున్నాడు. దాదాపు పదేళ్ల తర్వాత బెంగాలీ భాషలో బిగ్‌బాస్ రీ లాంచ్ అవుతోంది. ఈ క్రమంలో షో లో పాల్గొనను న్న కంటెస్టెంట్లను కన్ఫర్మ్ చేస్తూ నిర్వాహకులు ఓ ప్రమోషనల్ వీడియో రిలీజ్ చేశారు.



**మూడో సీజన్‌కు గంగూలీ!**

బెంగాలీ భాషలో బిగ్‌బాస్ పదేళ్ల కిందటే ప్రారంభమైంది. మొదటి సీజన్‌కు మిథున్ చక్రవర్తి, రెండో సీజన్‌కు నటుడు జీత్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. అయితే పలు కారణాల వల్ల ఆ తర్వాత ఈ షో జరగలేదు. ఇప్పుడు మళ్లీ బిగ్‌బాస్‌ను బెంగాలీలో తీసుకొస్తున్నారు. ఈ మూడో సీజన్ బిగ్‌బాస్ ప్రోగ్రామ్ ఆగస్టు 30 నుంచి ప్రారంభం కానుంది. దీనికి హోస్ట్‌గా వ్యవహరిస్తూ గంగూలీ బెంగాలీ ఆడియెన్స్‌ను అలరించనున్నారు. అయితే ఇలాంటి షోకు హోస్ట్‌గా చేయడానికి గల కారణాలను కూడా గంగూలీ వెల్లడించాడు.“'బిగ్‌బాస్ ఒక డిఫరెంట్ షో. అందరికీ దగ్గరైన ప్రోగ్రామ్, సుదీర్ఘ విరామం తర్వాత బెంగాల్‌లో మళ్లీ మొదలు కానుంది. ఇంతకు ముందు వచ్చిన బిగ్‌బాస్ షో ఎపిసోడ్స్‌ను ప్రతి రోజు చూసే సమయం ఉండేది కాదు. వీకెండ్ మాత్రం కచ్చితంగా చూసేవాడిని. అన్నింటికంటే ముఖ్యంగా సల్మాన్‌ఖాన్ హోస్ట్‌గా ఎలా చేశారో బాగా పరిశీలించాను. ఈ షోను హోస్ట్ చేయడం నాకు కూడా ఆసక్తికరంగానే ఉంది' అని గంగూలీ అన్నాడు. ఈ సీజన్‌లో మొత్తం 15 మంది కంటెస్టెంట్ లను ఎంపిక చేశారు. వీరిని సినిమా, క్రీడలు, మ్యూజిక్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్ వివిధ రంగాల్లో నుంచి సెలక్ట్ చేశారు. డిజైనర్ శ్యామ్ భట్ ఈ బిగ్‌బాస్ హౌస్‌ను 7000 చదరపు అడుగుల్లో సరికొత్తగా డిజైన్ చేశారు. ఇందులో 55 కెమెరాలు అమర్చారు. లోపల కంటెస్టెంట్ ల ప్రతి మూమెంట్‌ను కెమెరాలతో రికార్డు చేయనున్నారు. ఆగస్టు 30 రాత్రే ఈ బిగ్‌బాస్ సీజన్ 3 గ్రాండ్ ప్రీమియర్ వేడుక జరగనుంది. ఈ గ్రాండ్ ప్రీమియర్‌కు టీమ్‌ఇండియా మాజీ స్పిన్నర్ హర్భజన్‌సింగ్ కూడా విచ్చేసి సందడి చేసినట్లు ప్రోమోలో చూపించారు. ఇక రేపట్నుంచి నుంచి రెగ్యులర్ ఎపిసోడ్‌లు ఉంటాయి. ఓటీటీలో జియో హాట్‌స్టార్ వేదికగా 24x7 స్ట్రీమింగ్ అందుబాటులో ఉంటుంది.

**భారీ రెమ్యూనరేషన్!**

బిగ్‌బాస్ అనేది సుదీర్ఘమైన షో. రెండు నెలలకు పైగా ఈ షో సాగుతుంటుంది. అయితే ఇంత లాంగ్ ప్రోగ్రామ్ కోసం దాదా భారీగానే రెమ్యూనరేషన్ అందుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ఒక్క సీజన్‌కే రూ.120 కోట్ల పారితోషికం తీసుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. ఒకవేళ ఇది నిజమైతే మాత్రం బుల్లితెర హోస్టుల్లో ఇది ఒక రికార్డు అవుతుంది. అలాగే గంగూలీ గతంలోనూ బుల్లితెరపై హోస్టింగ్ చేశాడు. బెంగాలీలో దాదాగిరి అన్‌లిమిటెట్ అనే క్విజ్ ప్రోగ్రామ్‌కు వ్యాఖ్యాతగా వ్యవహరించాడు. అయితే బిగ్‌బాస్ రియాలిటీ షో కాబట్టి, ఇందులో కంటెస్టెంట్ లపై దాదా ఎలాంటి పంచ్‌లు వేస్తాడు? వాళ్లు చేసే తప్పులను ఎలా ఎత్తి చూపుతాడని ఆసక్తిగా ఉంది.

# ఐసీసీ నిబంధనల ఉల్లంఘన


- మహిళల ఛాంపియన్స్ ట్రోఫీపై నీలినీడలు.. లంక ఆతిథ్య హక్కులు రద్దు
- మహిళల ఛాంపియన్స్ ట్రోఫీకి కొత్త వేదిక అన్వేషణ

స్పోర్ట్స్ డెస్క్:

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించేందుకు రెడీ అవుతోంది. 2027లో ఈ టోర్నీ తొలి ఎడిషన్ జరగనుంది. ఇందులో ఆరు జట్లు పాల్గొంటాయి. అయితే మొదటి ఎడిషన్‌కు శ్రీలంక ఆతిథ్యం ఇవ్వనుందని తొలి నుంచి ప్రచారం సాగింది. కానీ, ఐసీసీ ఇప్పుడు తమ నిర్ణయం మార్చుకోనున్నట్లు సమాచారం. ఈ టోర్నమెంట్ నిర్వహణ హక్కులను శ్రీలంక నుంచి వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే? మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య హక్కుల గురించి రీసెంట్‌గా శ్రీలంక క్రికెట్ తాత్కాలిక కమిటీ కార్యదర్శి ప్రకాశ్ షాఫ్టెర్ స్పందించారు. 'ఈ టోర్నమెంట్ శ్రీలంక నుంచి మార్చేశారు. దీంతో మేం ఆతిథ్య హక్కులు కోల్పోయినట్లే! ఇంకో వేదికగా ఈ టోర్నమెంట్ జరిగే అవకాశాలు ఉన్నాయి. అయితే అది ఎక్కడ అనేది నాకు కూడా తెలియదు' అని ప్రకాశ్ తెలిపారు.

**కారణం ఇదే!**

ఐసీసీ నిబంధనల ప్రకారం, సభ్య దేశల క్రికెట్ బోర్డులు స్వతంత్రంగా ఉండాలి. ఆ దేశ బోర్డులో రాజకీయల జోక్యం ఉండకూడదు. అయితే ప్రస్తుతం శ్రీలంక క్రికెట్ బోర్డులో చాలా కాలంగా రాజకీయ జోక్యం కొనసాగుతోంది. ఈ బోర్డును ఆ దేశ ప్రభుత్వం నియమించిన తాత్కాలిక కమిటీ నడిపిస్తోంది. దీంతో కొద్ది రోజులుగా లంక బోర్డు మెంబర్లకు కూడా ఐసీసీ బోర్డు మీటింగ్‌లో అనుమతి లేదు. ఈ విషయంలో సంస్కరణలు చేపట్టి,




ఎన్నికలు నిర్వహించాలని ఐసీసీ ఇప్పటికే లంక బోర్డుకు సూచించింది. అయితే తాత్కాలిక కమిటీ దీనికి సంబంధించిన ముసాయిదాను లంక క్రీడా శాఖకు పంపించింది. కానీ, మూసాయిదా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదం పొందాలి. ఆ తర్వాతే లంక క్రికెట్ బోర్డులో ఎన్నికల నిర్వహణకు ఛాన్స్ ఉంటుంది. అయితే ఇదంతా జరిగేందుకు సమయం పట్టేలా ఉంది. అందుకే ఆతిథ్య దేశాన్ని మార్చేలా ఐసీసీ మనసు మార్చుకున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పటికైతే మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ హక్కులను శ్రీలంక నుంచి ఐసీసీ ఇంకా అధికారికంగా ఉపసంహరించుకోలేదు. అలాగే కొత్త ఆతిథ్య దేశం పేరును కూడా ప్రకటించలేదు. దీనిపై తుది నిర్ణయం బోర్డు తదుపరి సమావేశంలో తీసుకునే అవకాశం ఉంది. కానీ ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే, మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ తొలి ఎడిషన్ మాత్రం శ్రీలంకలో జరగదని అర్థమవుతోంది. ఈ టోర్నమెంట్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు జరగాల్సి ఉంది. ఇందులో ఆరు జట్లు పోటీపడతాయి. అంటే, ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్ 5 జట్లతోపాటు ఆతిథ్య దేశం టోర్నీలో ఆడేందుకు అర్హత సాధిస్తాయి.

# ఫ్రీ హిట్ వద్దు.. ఫైన్ వేయండి

- నో-బాల్స్‌కు చెక్ పెట్టేలా గవాస్కర్ కఠిన సూచనలు
- టెస్ట్ క్రికెట్‌లో ఫ్రీ హిట్‌పై గవాస్కర్ అసంతృప్తి
- జడేజా 85 నో-బాల్స్ వేయడమా? బౌలర్ల తీరుపై మండిపడ్డ క్రికెట్ లెజెండ్

స్పోర్ట్స్ డెస్క్:

శ్రీలంక జట్టుతో ఇటీవల ముగిసిన రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భారత్ 10 తేడాతో సిరీస్ కైవసం చేసుకున్నప్పటికీ.. కొలంబో టెస్టును డ్రాగా ముగించడం వల్ల కీలకమైన వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ పాయింట్లను కోల్పోవాల్సి వచ్చింది. ఈ మ్యాచ్‌లో భారత బౌలర్లు పదేపదే నోబాల్స్ వేయడం జట్టు విజయావకాశాలను దెబ్బతీసింది. రవీంద్ర జడేజాతో పాటు అరంగేట్ర స్పిన్నర్ సారాంశ్ జైన్ కూడా ఫ్రంట్ ఫుట్ క్రమశిక్షణ పాటించకపోవడంపై టీమిండియా దిగ్గజ ఆటగాడు సునీల్ గవాస్కర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మిడ్‌డే కాలమ్‌లో సునీల్ గవాస్కర్ రాసుకొస్తూ.. ఫ్రంట్ ఫుట్ లైన్ దాటడం అనేది బౌలర్ చేతిలోనే ఉండే అంశమని పేర్కొన్నారు. స్టేడియంలో టేప్ కొలతతో రనప్ కొలుచుకునే సౌకర్యం ఉన్న ఈ కాలంలో ఓవర్ స్టెప్పింగ్ చేయడానికి ఎలాంటి సాకులు లేవని ఆయన స్పష్టం చేశారు.

# స్పిరిట్ పై లేటెస్ట్ అప్‌డేట్!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్టార్ లైనప్ లో భారీ అంచనాలు ఉన్న సినిమా 'స్పిరిట్'. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా ఓ పవర్ ఫుల్ కాప్ స్టోరీగా రాబోతుంది. ఐతే, ఈ సినిమా సెకండ్ హాఫ్ లో ఓ స్పెషల్ ఎపిసోడ్ ఉందట. ఈ ఎపిసోడ్ కోసం సందీప్ రెడ్డి వంగా ఓ స్పెషల్ రోల్ ను డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రోల్ కోసం ఓ బాలీవుడ్ స్టార్ హీరోని ఎంపిక చేయాలని సందీప్ రెడ్డి వంగా ప్లాన్ చేస్తున్నాడట. మరి ఈ వార్తలో ఎంత వాస్తవం ఉందో చూడాలి. కాగా ఈ సినిమాలో త్రుప్తి దిమ్రిని హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రభాస్ లుక్ కూడా పక్కా వైల్డ్ అండ్ మాస్ అవతార్ లో లో ఉంది. కాగా మ్యూజిక్ డైరెక్టర్ హర్షవర్ధన్ రామేశ్వర్ తో సందీప్ రెడ్డితో మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా పూర్తి చేశాడు. ఈ చిత్రాన్ని టి-సిరీస్ మరియు భద్రకాళి పిక్చర్స్ భారీ స్థాయిలో నిర్మించనున్నాయి. అన్నట్టు 'స్పిరిట్' మెయిన్ కథాంశమే చాలా కొత్తగా ఉంటుందని.. సందీప్ రెడ్డి వంగా నుంచి మరో వినూత్న సినిమా రాబోతుంది.

'బెత్లెహెం కుడుంబ యూనిట్'

## తెలుగులో విడుదల



నివిన్ పౌలీ, మమితా బైజు జంటగా నటించిన లేటెస్ట్ బ్లాక్‌బస్టర్ 'బెత్లెహెం కుడుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఏడీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇటీవల మలయాళంలో విడుదలై ఘన విజయాన్ని అందుకుంది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 4న తెలుగులో గ్రాండ్‌గా విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్ లో ఫన్ లవ్ ఎంటర్ టైమెంట్ అదిరిపోయింది. నివిన్ పౌలీ జస్టిన్ పాత్రలో కనిపించారు. 2005లో ఆన్‌లైన్‌లో క్యాసెట్ పాటలను కన్వర్ట్ చేసి అప్‌లోడ్ చేస్తూ తనకు తానే 'MP3King' అనే పేరు పెట్టుకున్న జస్టిన్ పాత్రలో పరిచయం కావడం ఆకట్టుకుంది. మమితా బైజు కాలేజీ విద్యార్థినిగా, గిటార్ వాయిస్తూ ఆల్టర్నేటివ్ రాక్ మ్యూజిక్‌ను ఇష్టపడే అమ్మాయిగాకనిపించింది. నివిన్ పౌలీ, మమితా బైజు లైట్ హార్టెడ్ హ్యూమర్, న్యాచురల్ పెర్ఫార్మెన్స్ ఆకట్టుకుంటున్నాయి. గిరీశ్ ఏడీ తనదైన కంఫర్ట్, నాస్టాల్జిక్ టచ్‌తో కథను తెరకెక్కించారు. ప్రేమ, హ్యూమర్, నాస్టాల్జియా, కమ్యూనిటీ డ్రామాను కలిపిన ఈ ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది.

## ధర్మన్‌లో టాలీవుడ్ హీరో!

కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా దర్శకుడు అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్న అవైటెడ్ చిత్రం 'ధర్మన్' కోసం అందరికీ తెలిసిందే. ఒక డెడ్లి డాక్టర్ గా సూపర్ స్టార్ రజినీకాంత్ ఇందులో నటిస్తుండగా మేకర్స్ శరవేగంగా సినిమా షూట్ ని ప్రస్తుతం చేస్తున్నారు. అయితే ఈ చిత్రంలో మన టాలీవుడ్ కి చెందిన యువ హీరో రామ్ పోతినేని కూడా నటిస్తున్నట్టుగా ఓ టాక్ వచ్చింది. పైగా తాను విలన్ రోల్ అంటూ ఆ మధ్య వినిపించిన సంగతి తెలిసిందే. ఇక ఇదిలా ఉండగా రామ్ ఆల్రెడీ ఈ సినిమా సెట్స్ లో జాయిన్ అయినట్టు కూడా తెలుస్తుంది. ఒకపక్క తన స్వీయ దర్శకత్వం సినిమాలోనే కాకుండా ధర్మన్ లో కూడా గ్యాప్ లేకుండా షూటింగ్ లో పాల్గొంటున్నట్టుగా టాక్. అంతే కాకుండా ధర్మన్ లో తనది చాలా పెద్ద రోల్ అనే అని కూడా సినీ వర్గాల్లో వినిపిస్తుంది. సో వీటిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.





## కాగితం పడవలు గుర్తుండిపోయే ప్రేమకథ

వర్ధన్, కృష్ణప్రియ హీరో హీరోయిన్లుగా ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో తెరకెక్కుతున్న బ్యూటి ఫుల్ లవ్‌స్టోరీ 'కాగితం పడవలు'. ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్లపై కీర్తన నరేష్, T. R. ప్రసాద్ రెడ్డి, వెంకట్రాజుల, గాయత్రమ్మ అంజనప్ప నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. సెప్టెంబర్ 18న ఈ చిత్రం ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ సాంగ్ లాంచ్ చేశారు. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో వర్ధన్ మాట్లాడుతూ: అందరికీ నమస్కారం. కాగితం పడవలు.. ఒక కాలువులో ప్రయాణం చేయాలని అనుకున్నాం. తెలియకుండానే ఒక సముద్రంలోకి వచ్చేశాం. ఎన్నోసార్లు ఒడ్డుకు వద్దాం అనుకున్నాం. కానీ ఇంకా చాలా దూరం వెళ్లాల్సి వచ్చింది. ఈ ప్రయాణంలో మాకు ఎంతగానో సపోర్ట్ చేసిన మా నిర్మాతలకు ధన్యవాదాలు. ఈ రోజుల్లో సినిమా తీయడం కంటే దాన్ని రిలీజ్ చేయడం చాలా కష్టం. డైరెక్టర్ తుకారాం గారు చాలా అద్భుతంగా తీశారు. ఈ సినిమా పనిచేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు. సెప్టెంబర్ 18న థియేటర్స్‌లో కలుద్దాం. దర్శకుడు తుకారాం మాట్లాడుతూ: అందరికీ నమస్కారం. మా సినిమాకి మా నిర్మాతలే హీరోలు. మా నిర్మాతలు లేకపోతే ఈ సినిమా ఇంత దూరం వచ్చేది కాదు. మన ప్రతి ఒక్కరి జీవితంలో ఒక ప్రేమ కథ ఉంటుంది. ఈ సినిమా చూస్తే మీ ప్రేమకథ మీకు గుర్తుకొస్తుంది. మీరందరూ ఈ సినిమాను థియేటర్‌లో చూడండి. తప్పకుండా ఎంజాయ్ చేస్తారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com